

**ఆరు లైన్ల రహదారిగా విజయవాడ హైవే** 3 లో..

నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

రిపోర్టర్లు కావలెను
పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.
అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.
మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.
9100900918
9100900931

ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | బుధవారం | 06- 08- 2025 | సంపుటి : 1 | సంచిక : 65 | పేజీలు : 8 | వెల : 4/-



# ఉత్తరాఖండ్‌లో ఉప్పెన

- ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు
- ధరాలి గ్రామంపై ముంచెత్తిన వరద
- జలప్రవాహానికి నలుగురు మృతి
- వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు
- సిఎం పుష్కర్ సింగ్ ధామితో ప్రధాని, హోంమంత్రి ఆరా



**డెహ్రాడూన్ - నేటి ప్రభాత సూర్య :**
ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ఇక్కడి ధరాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు సమాచారం. దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని, 20-25 హోటళ్లు, నివాసాలు కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కుంభవృష్టి కారణంగా ఎగువ ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి మెరుపు వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత

మిగతా 2వ పేజీలో..

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ అమీతుమీ!

- ఢిల్లీలో హస్తం పార్టీ పోరాటం
- బీసీ రిజర్వేషన్ల కోసం సమరం
- హస్తిన చేరిన కాంగ్రెస్ బలగం
- లోక్‌సభలో వాయిదా తీర్మానానికి పట్టు
- నేడు జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా
- గురువారం రాష్ట్రపతికి వినతిపత్రం
- మంత్రి వాకిటి శ్రీహరి, ఆది శ్రీనివాస్ వెల్లడి



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**
పార్లమెంట్ ఆవరణలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మంగళవారం ఆందోళన చేపట్టారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే లోక్‌సభలో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు వాయిదా తీర్మానాలు ఇచ్చారు. మరో వైపు.. కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి భారీగా చేరుకుంటున్నారు. ఇప్పటికే ఢిల్లీకి కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, పార్టీ కీలక నేతలు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడారు. చిత్తశుద్ధి ఉంటే కేందప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవద్దని

మిగతా 2వ పేజీలో..

# బ్యాలెట్.. బెటర్!

- ఈవీఎంలపై విశ్వసనీయత పోయింది..
- బ్యాలెట్ పేపర్ ద్వారానే ఎన్నికలు జరపండి
- బీహార్‌తో దీనిని ప్రారంభించండి
- కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీలో బిఆర్‌ఎస్ డిమాండ్




**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**
భారతదేశంలో ఇకపైన జరిగే ప్రతి ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. బ్యాలెట్ విధానాన్ని బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కేటీఆర్ కోరారు. ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు బిఆర్‌ఎస్ నేతల బృందం కేటీఆర్ నేతృత్వంలో ఈసీ అధికారులతో సమావేశం అయింది. దేశంలో ఎన్నికల వ్యవస్థ, నూతన సంస్కరణలు, ఎన్నికల నియమావళి

మిగతా 2వ పేజీలో..



## రెండేళ్లు వేరే చోట చదివితే తప్పేంటి?

- తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ
- రెండేళ్లు బయట ఉన్నంత మాత్రాన స్థానికేతరుడా?
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన సర్వోన్నత ధర్మాసనం

2 లో..


3 లో..

## మరిన్ని సుంకాలు పెంచుతాం

- భారత్‌కు ట్రంప్ హెచ్చరికలు




## పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

- 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు

4 లో..

# బిఆర్‌ఎస్ అవినీతికి కాళేశ్వరం ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి హెచ్చరిక



**ఖమ్మం- నేటి ప్రభాత సూర్య :**
కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్‌ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్‌ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్‌ఎస్ నేతలు జనంలోకి

మిగతా 2వ పేజీలో..



## పిల్లలను అమ్మే గ్యాంగులతో నమ్రతకు లింక్

- నమ్రత పోలీస్ కస్టడీలో పలు విషయాలు వెల్లడి

2 లో..



## బండికి మళ్లీ సిట్ పిలుపు

3 లో..

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్

- కెసిఆర్‌ను ఇబ్బంది పెట్టే లక్ష్యంతో విచారణ
- అసెంబ్లీలో చర్చకు పెడితే ప్రభుత్వాన్ని చీల్చి చెండాడుతాం
- తుమ్మడిహట్టి వద్ద నీళ్లు లేవని కేంద్రమే చెప్పింది
- తెలంగాణ భవన్‌లో హరీష్ రావు ప్రజెంటేషన్
- ఇదంతా కుట్రల నివేదిక అని కొట్టిపారేసిన హరీష్ రావు



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :**
కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చిన తాజా నివేదికను మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. గత 20 నెలలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేసి రాజకీయ కక్షలు సాధించేందుకే కమిషన్‌లను ఏర్పాటు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. డబ్బులు దంచుకోవడానికీ, ప్రతిపక్షాలపై కేసులు పెట్టడానికీ ఈ కమిషన్‌లు సాధనంగా మారాయని అన్నారు. తెలంగాణ భవన్‌లో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల ముందు ఒక రిపోర్ట్, బీఆర్‌ఎస్ రజతోత్సవ

మిగతా 2వ పేజీలో..



## కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్

- లీకులు ఇచ్చి వార్తలు రాయించుకుంటున్నారు
- అసెంబ్లీలో చర్చ పెడితే ఎండగడతాం: కెటిఆర్

3 లో..



## గువ్వల బాటలో గులాబీలు

- బిజెపి వైపు బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేల చూపు
- త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం

3 లో..

కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు.

# అవసరమైతే మళ్లీ రాజీనామా

- మంత్రి పదవి ఇస్తే ప్రజలకు ఉపయోగ పడేది
- పదవిని అడ్డం పెట్టుకుని పైరవీలు చేసే రకం కాను
- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు




**నల్లగొండ- నేటి ప్రభాత సూర్య :**
కాంగ్రెస్ సీనియర్ నేత, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ప్రజల కోసం మళ్లీ రాజీనామాకైనా సిద్ధమేనని.. అవసరమైతే మునుగోడుకు మళ్లీ ఉప ఎన్నిక తెస్తానని హాట్ కామెంట్స్ చేశారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిత్వం నాది కాదని.. నాలాంటి వ్యక్తికి మంత్రి పదవి వస్తే ప్రజలకే మేలని అన్నారు. మంగళవారం సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మ గూడెం గ్రామంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజలకోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా?మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు. పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డు పెట్టు కుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి

మిగతా 2వ పేజీలో..

# ఇచ్చిన హామీలు అమలు

- చేతల ప్రభుత్వమని చేసి చూపుతున్నాం
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



**మేడ్చల్- నేటి ప్రభాత సూర్య :**
అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని, మాటలతో కాకుండా పనుల చేసి తమది చేతల ప్రభుత్వమని చెబుతున్నామని అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు,కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి

మిగతా 2వ పేజీలో..

# పిల్లలను అమ్మే గ్యాంగులతో నమ్రతకు లింక్

**నమ్రత పోలీస్ కస్టడీలో పలు విషయాలు వెల్లడి**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** సృష్టి అక్రమ సరోగసీ, ఐవీఎఫ్ శిశువుల కొనుగోలు కేసులో అరెస్టయిన డాక్టర్ నమ్రత ఐదు రోజుల కస్టడీలో పోలీసులు కీలక విషయాలను రాబట్టారు. పిల్లల్ని అమ్మే గ్యాంగులతో కూడా డాక్టర్ నమ్రతకు సంబంధాలు ఉన్నట్లు విచారణలో తేలింది.



మహారాష్ట్ర, అహ్మదాబాద్, ఆంధ్రాకు చెం దిన పిల్లల్ని కిడ్నాప్ చేసే ముఠాలతో నమ్రతకు లిం కులు ఉన్నాయి. పిల్లల్ని కొని అమ్ముతున్న నందిని, హర్ష, పవన్‌లతో సంబంధాలు న్నట్లు పోలీసుల కస్టడీలో వెల్లడైంది. గతంలోనూ పిల్లల్ని అమ్ముతూ నందిని ,హర్ష, పవన్ అరెస్ట్ కావడం గమనార్హం. ఒక్కొక్క పిల్లాడిని 3 నుంచి 5లక్షల రూపాయలు ఇచ్చి డాక్టర్ నమ్రత కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఐవీఎఫ్ కోసం వచ్చే దంపతులను సరోగోసి వైపు మళ్లించి అక్రమాలకు పాల్పడుతున్నట్లు కస్టడీలో నమ్రత నిజం బయటపెట్టింది. నందిని, హర్ష, పవన్.. కలిసి కొన్ని ఏళ్ల నుంచి పిల్లల్ని అమ్ముతున్న గ్యాంగ్‌గా ఏర్పడ్డారు. హైదరాబాద్‌లో మరొక నాలుగు సెంటర్లకు కూడా పిల్లల్ని అమ్మినట్లు పోలీసులు గుర్తించారు. పెట్టీ కేర్, హెడ్జ్ ,ఒయాసిస్, సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లకు పిల్లలను అమ్మినట్లు విచారణలో తేలింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో ఉన్న పలు ఫెర్టిలిటీ సెంటర్లతో ఈ ముఠాకు సంబంధాలు ఉన్నాయి. పిల్లల అమ్మకాలతో పాటు యువతి, యువకులను ఈ గ్యాంగ్ ట్రాప్ చేసింది. యువతి, యువకుల వీర్యకణాలు, అండాలను సేకరించి అమ్ముకుంది. డాక్టర్ నమ్రత పెద్ద ఎత్తున ఈ గ్యాంగ్‌కు డబ్బులు ముట్ట జెప్పినట్లు కస్టడీలో బయటపడింది. డాక్టర్ సదానందం సృష్టి కేసులో కీలక పాత్ర పోషించినట్లు- కూడా వెల్లడైంది. గాంధీ ఆసుపత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా సదానందం కొనసాగుతున్నాడు. ప్రతి ఆపరేషన్ వెనుక సదానందం పాత్ర ఉన్నట్లు- పోలీసులు గుర్తించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మరొకరు బలి

**అప్పులు చేసి తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య**

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :** ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు.కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థికంగా నష్టపోయిన నరేశ్ సుమారు రూ.15 లక్షలు అప్పు చేసినట్లు సమాచారం. ఇటీవల అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న నరేశ్.. అప్పులు తీర్చే మార్గంలేక మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# విద్యుత్ తీగ పడి యువరైతు దుర్మరణం

**భద్రాద్రి కొత్తగూడెం,నేటి ప్రభాత సూర్య :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలంలో విషాదం చోటుచేసుకుంది. ఓ యువకుడు పొలానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో వాహనంతో సహా దగ్ధమై అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందు గ్రామానికి చెందిన పర్సిక రాజు(35) అనే వ్యక్తి తన బైక్ వెళ్తుండగా గ్రామ శివారులో అతడిపై విద్యుత్ తీగ పడింది. బైక్ తో సహా అతడు కాలిపోవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ అధికారులు కరెంట్ సరఫరా నిలిపివేశారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని శవ పరీక్ష నిమిత్తం గుండాల ప్రభుత్వాత్రికి తరలించారు. మంటల్లో కాలిపోతున్న యువకుడిని చూసి కుటుంబ సభ్యులు, బంధువుల బాధపడే తీరు అందరినీ కలిచి వేసింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

# సినీ కార్మికుల సమ్మె

**చిరంజీవితో పలువురు నిర్మాతల భేటీ**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** సినీ కార్మికుల వేతన పెంపుపై టాలీవుడ్‌లో కొన్ని రోజులుగా చర్చలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఫిల్మ్ ఛాంబర్, ఫిల్మ్ ఫెడరేషన్‌ల మధ్య సఖ్యత కుదరడం లేదు. దీంతో ప్రముఖనటుడు చిరంజీవితో పలువురు నిర్మాతలు మంగళవారం ఆయన నివాసంలో భేటీ అయ్యారు.




ఆ వివరాలను నిర్మాత సి. కల్యాణ్ మీడియాకు వెల్లడించారు. నిర్మాతల నిర్ణయాన్ని చిరంజీవి అడిగి తెలుసుకున్నారు. యూనియన్ నాయకుల వాదన కూడా వినాలన్నారు. మూడు రోజుల్లో ఇరు వర్గాలు సామరస్యంగా చర్చించుకోవాలని సూచించారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తాను జోక్యం చేసుకుంటానని తెలిపారు అని వివరించారు.

# బుల్లెట్, గంజాయి స్వాధీనం

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** మీర్‌పేట్‌లోని ఓ ఇంట్లో తుపాకీ బుల్లెట్ కలకలం సృష్టించింది. ఓ యువకుడి దగ్గర బుల్లెట్లతో పాటు గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మీర్‌పేట్‌లోని ఎస్ఎల్ఎన్ ఎస్ కాలనీలో చంద్రశేఖర్ అనే వ్యక్తి రెండేళ్లుగా అద్దెకు ఉంటున్నాడు. హైదరాబాద్ లోని పలు ప్రాంతాలలో దొంగతనం చేసి అద్దె ఇంట్లో తలదాచుకుంటున్నాడు. పోలీసులు చంద్రశేఖర్ అరెస్ట్ చేసి బుల్లెట్‌తో పాటు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

# రెండేళ్లు వేరే చోట చదివితే తప్పేంటి?



- తెలంగాణ స్థానికతపై సుప్రీంలో విచారణ
- ప్రభుత్వ తీరును ప్రశ్నించిన చీఫ్ జస్టిస్ గవాయ్
- తీర్పును రిజర్వ్ చేసిన సర్వోన్నత ధర్మాసనం

**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. దీనిపై తీర్పును ధర్మాసనం రిజర్వ్ చేసింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసుకోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్ష రాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లోస్థానిక వ్యవహారం పలు విధాలుగా ఉందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని సింఘ్వీ కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

# ఉత్తరాఖండ్‌లో ఉప్పెన

మొదటిపేజీ తరువాయి..

సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలు ఘటనా స్థలానికి బయల్దేరి రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ దిగ్భాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధరాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్లో నిమగ్నమై పనిచేస్తున్నాయని తెలిపారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు తెలిపారు. బాధిత ప్రజలకు సాధ్యమైనంతగా అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు- తెలిపారు. మరోవైపు.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సీఎం ధామికి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ధరాలీ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రధాని మోదీ సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి పుష్కర్ ధామితో మాట్లాడి వివరాలు ఆరా తీసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయ బృందాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీగ్రామం మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. సముద్రం మీద పడిందా అన్న స్థాయిలో మేఘం వర్షించింది. దీంతో నీరు, అక్కడున్న మట్టి కలిసి భారీ ఎత్తున బురద వరద ధరాలిని కప్పేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రదేశం మరు భూమిని తలపిస్తోంది. చార్‌ధామ్ యాత్రికులు ఎక్కువగా ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. యాపిల్స్‌కు ప్రసిద్ధిగాంచిన ఉత్తరాఖండ్‌లోని హర్సిల్ లోయ ఇక్కడకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఉత్తరాఖండ్‌లో మారుమూల ఉన్న అత్యంత రమ్యమైన ప్రదేశాల్లో ఒకటి. దీని సమీపం నుంచే భాగీరథి నది ప్రవహిస్తోంది. రిషికేశ్ నుంచి బయల్దేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్ మీదుగా ఇక్కడికి వెళ్లవచ్చు. సముద్రమట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తున ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి గంగోత్రి ధామ్ కేవలం 20 కిలోమీటర్ల దూరం. గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతుంది. చార్‌ధామ్ సహా ఇతర తీర్థయాత్రల సీజన్‌లో ధరాలీ గ్రామానికి సందర్శకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో లాడ్జిలు, అతిథి గృహాలున్నాయి. తక్కువ ధరలకే వసతి లభిస్తుండటంతో.. యాత్రికులు వీటి వైపు మొగ్గుచూపుతారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరంలో నీలాంగ్ లోయ ఉంది. భారత్-టిబెట్ మధ్య వ్యాపారం జరిగే పాత మార్గం ఇక్కడి నుంచి వెళుతుంది. ఇక్కడ రాత్రిళ్లు బస చేయడానికి అనుమతి లేదు. ఈ ప్రదేశాలను వీక్షించాలన్నా అటవీశాఖ అనుమతి ఉండాలి. ఇక ధరాలీ సమీపంలోని హర్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్‌ధామ్ యాత్రికులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడ ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్ తాల్ ప్రదేశానికి టెక్కింగ్‌కు వెళ్లేవారికి ఈ ప్రాంతం బేస్‌క్యాంప్‌గా ఉంటుంది. ధరాలీ గ్రామం సమీపంలోని ఖీర్‌గఢ్ నదీ పరివాహక ప్రదేశంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచింది. ఇది ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రదేశంపై విరుచుకుపడింది. ఆగస్టు 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా చోటు-చేసుకున్న మెరుపు వరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్‌స్టేలు కొట్టు-కుపోయాయి. అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం నమోదు కావడాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ముఖ్యంగా గంటలోపు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో 10 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిస్తే దానిని క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటు-ంటారు. ఇక 5 సెంటీ-మీటర్ల కంటే తక్కువ ఉంటే వాటిని మినీ క్లౌడ్ బరస్ట్‌గా పేర్కొంటాం. ఇటు-వంటి వర్షాలు సాధారణంగా పర్వతాలు, కొండ ప్రదేశాల్లో కురుస్తుంటాయి. ముఖ్యంగా హిమాలయాల్లో తరచూ వీటిని చూడొచ్చు. భారీ ప్రాణ, ఆస్తి నష్టాలకు దారితీసే ఈ క్లౌడ్‌బరస్ట్‌లు గతంలోనూ చోటు చేసుకొన్నాయి.

# బ్యాలెట్.. బెటర్!

మొదటిపేజీ తరువాయి..

వంటి అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తుంది. అందులో భాగంగానే టిఆర్ఎస్‌ని సమావేశానికి ఆహ్వానించింది. కేంద్ర ఎన్నికల సంఘంతో జరిగిన సమావేశంలో బిఆర్ఎస్ బృందం పలు కీలక అంశాలను ప్రస్తావించింది. ముఖ్యంగా ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో దేశాలు బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహిస్తున్నాయని గుర్తుచేసింది.. భారత్‌లో ఈవీఎంల ద్వారా జరుగుతున్న ఎన్నికల పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్న పరిస్థితుల్లో, ఈవీఎంలను పక్కనపెట్టి బ్యాలెట్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. నవంబర్ లో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచే బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఎన్నికలు వస్తే చాలు రాజకీయ పార్టీలు అడ్డగోలు వాగ్దానాలు చేస్తున్నాయని, వాటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయకపోతే చర్యలు కూడా తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని బిఆర్ఎస్ కోరింది. మరోపక్క బీహార్ లో జరిగిన ఓట్ల జాబితా సమగ్ర సర్వేపై కూడా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించినట్టు- తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ అమీతుమీ!

మొదటిపేజీ తరువాయి..

సూచిం చారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు మద్దతు తెలిపారని డిమాండ్ చేశారు. ఇప్పటికే ముసాయిదాని రాష్ట్రపతికి పంపించామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపాలని మంత్రి వాకిటి శ్రీహరి డిమాండ్ చేశారు. 50శాతం పరిమితిని ఎత్తివేయాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసేందుకు కార్యచరణ రూపొందించారని చెప్పుకొచ్చారు. బుధవారం జంతర్ మంతర్ వద్ద దాదాపు 20,000 వేల మందితో ఆందోళన నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బీసీ రిజర్వేషన్ పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందని ఉద్ఘాటించారు. మైనార్టీలను అడ్డుగా చూపుతూ బీసీలకు రిజర్వేషన్లు అడ్డుకోవడం సరికాదని మంత్రి వాకిటి శ్రీహరి హితవు పలికారు. బీజేపీ ఎమ్మెల్యేలు తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు సపోర్టు చేశారని.. ఢిల్లీలో ఎందుకు మిన్నకుండిపోయారని తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హైదరాబాద్‌లో కాకుండా ఢిల్లీలో ధర్నా చేయాలని సూచించారు. అసలు బీసీ రిజర్వేషన్ విషయంలో కవితకు ఏం సంబంధమని నిలదీశారు. కల్వకుంట్ల కుటుంబంలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదని విమర్శించారు. పార్లమెంట్‌లో ఎంపీల వాయిదా తీర్మానాలు, ధర్నా, గురువారం రాష్ట్రపతిని కలుస్తామని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

# అవసరమైతే మళ్లీ రాజీనామా

మొదటిపేజీ తరువాయి..

ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాల నుకు కోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయనని కోమటరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నేను ప్రభుత్వానికి ఏదైనా వ్యతిరేకంగా మాట్లాడితే మంత్రి పదవి రాలేదని మాట్లాడుతున్నానని అంటున్నారు. ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం చెప్పినా కూడా మునుగోడు ప్రజల కోసం ఇక్కడ నుండే పోటీ చేశానని చెప్పారు. పదవిని అడ్డుపెట్టుకుని కోట్లు సంపాదించే వాడికి పదవి కావాలి కానీ.. నాలాంటి వారికి ప్రజలే ముఖ్యమన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేటప్పుడే తనకు మంత్రి పదవి హామీ ఇచ్చారని.. ఆ తర్వాత ఎంపీ ఎన్నికల సమయంలోనూ ఇచ్చారంటూ కాంగ్రెస్ పెద్దలకు గుర్తు చేశారు. పదవి ఇస్తారా.. ఇవ్వరా అనేది మీ ఇష్టం.. సీనియర్ నేతనే కాబట్టి మంత్రి పదవి ఆశించడంలో తప్పులేదంటూ మనసులో ఉన్నది చెప్పానని అన్నారు.

# బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం ఉదాహరణ

మొదటిపేజీ తరువాయి..

వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరి షత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ-, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు-జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# ఇచ్చిన హామీలు అమలు

మొదటిపేజీ తరువాయి..

హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ- హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.

# కాళేశ్వరం కక్షసాధింపు కమిషన్


మొదటిపేజీ తరువాయి..

సభ ముందు ఒక రిపోర్ట్, స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇంకో రిపోర్ట్.. ఇవన్నీ కుట్రలో భాగం. మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇచ్చారు. 60 పేజీల రిపోర్ట్ కుట్రతో బయట పెట్టారు. అసలు 650 పేజీల రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెట్టండి, చీల్చి చెండాడుతాం అని అన్నారు. కమిషన్ ఇచ్చిన నివేదికలో కేంద్ర ప్రభుత్వాన్నే తప్పు పట్టినట్లు ఉందని హరీష్ విమర్శించారు. కమిషన్ ఒకవైపే విని ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది ట్రాష్, బేస్‌లెస్. గతంలో ఇందిరా గాంధీ, చంద్రబాబు మీద వచ్చిన రిపోర్టులు న్యాయస్థానాల్లో నిలబడలేదు. ఇవి కూడా నిలబడవని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయని అని హరీష్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఇబ్బంది పెట్టేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారు. కానీ నిజం ఏమిటంటే, సర్ ఆర్థర్ కాటన్‌ను ఎలా పూజిస్తారో, భవిష్యత్తులో కేసీఆర్‌ను కూడా అలాగే పూజిస్తారు. సీఎం రేవంత్‌కీ ఇది తెలుసు. అందుకే మొన్న గంధమల్ల ప్రాజెక్టుకు కొబ్బరికాయ కొట్టాడని అన్నారు. తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు పెట్టడమే కాంగ్రెస్ చేసిన పెద్ద తప్పు అని హరీష్ ఆరోపించారు. ఆ నిర్ణయాన్ని మార్చి మెడిగడ్డకు తీసుకెళ్లిన విషయాన్ని సీడబ్ల్యూసీ కూడా ఆమోదించింది. కాళేశ్వరం డిపిఆర్‌లో అన్నీ క్లియర్‌గా చెప్పాం. నీళ్లు లేక మార్పులు చేయాల్సి వస్తుందని బహిరంగంగానే ప్రకటించాం. కేబినెట్ నిర్ణయం ప్రకారమే ఇది జరిగింది. 2016 జూన్ 3న కేబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు. అసెంబ్లీలో ఈ అంశంపై పూర్తి వివరణ ఇస్తామని హరీష్ సవాల్ విసిరారు. మీకు దమ్ముంటే మైక్ కట్ చేయకుండా మాట్లాడనివ్వాలి. ఆధారాలతోనే చర్చిస్తాం. ఇవాళ కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నట్లుగా ఆరోపణలు చేస్తున్నారు. తెలిస్తే ఇంకా ఆధారాలు సేకరించేవాళ్లం అని వ్యాఖ్యానించారు.

# కమిషనర్ రూటే సప'రేటు'!







# అనుమతులు లేకుండా రిసార్ట్

- అధికార పార్టీ నాయకుల అండతో పనులు..
- అడ్డూఅదుపు లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణాలు, రిసార్ట్‌లు
- అడ్డుకోవాల్సిన అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు
- ముందుగా నోటీసులు జారీ చేసి తర్వాత బేరసారాలు




**ఆదిబట్ల-నేటి ప్రభాత సూర్య:** ఆదిబట్ల మున్సిపల్ లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండా అక్రమ రిసార్ట్ నిర్మాణాలకు తెర తీస్తున్నారు. హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు మధ్య వర్తిత్వం వహిస్తుండడం విశేషం. ఈ క్రమంలో నిర్మాణదారుల నుంచి ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రుసుము భారీ మొత్తంలో గండి కొడుతున్నారు. నిలువరించాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. వివరాల్లోకి వెళితే ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి రాందాస్ పల్లి కి వెళ్లే దారిలో ఓ రిసార్ట్ ను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించడం విమర్శలకు తావిస్తోంది.

**అనుమతులు లేకుండా రిసార్ట్..**

ఆదిబట్ల మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ గా మారింది. ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం చేపడుతున్న అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇక్కడ అక్రమంగా మినీ రిసార్ట్ కం ఫార్మ్ హౌస్ పేరిట నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి కూడా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అధికార యంత్రాంగం చెబుతోంది. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుందామంటే అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లు చేస్తున్నారని వారు వాపోతున్నారు.

### ఫోన్ ఎత్తరు.. పెదవి విప్పరు!

ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణను నేటి ప్రభాత సూర్య ప్రతినిధి ఫోన్ లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన స్పందించడం లేదు. ఇప్పటికైనా ఈ అక్రమ నిర్మాణం పై జిల్లా ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో ..వేచి చూద్దాం..

## ఆరు లైన్లుగా విజయవాడ హైవే

**కేంద్రమంత్రి గడ్కరిని కలిసి కోరిన మంత్రి కోమటిరెడ్డి**



**న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :** మల్కాపూర్ నుంచి విజయవాడ వరకు రహదారిని 4 వరుసల నుంచి 6 వరుసలుగా విస్తరించడంతో పాటు సర్వీస్ రోడ్లను నిర్మించాలని కేంద్ర గడ్కరీని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికోరారు. కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమావేశ మయ్యారు. వచ్చే వారం ప్రధాన మంత్రితో సమావేశం అవనున్నారు. రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారుల మంజూరీపై గడ్కరీతో సుదీర్ఘంగా చర్చించారు. మంత్రితోపాటు తెలంగాణ ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో తెలం గాణ భవన్ నిర్మాణం గురించి ప్రయత్నాలు చేస్తున్నాం.. ప్లాన్స్ జరుగుతున్నాయన్నారు. పటౌడీ హౌస్ లో రెండు నెలల్లో పనులు మొదలు పెట్టాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో అనుమతుల కోసం కొంత ఆలస్యం అవుతోందన్నారు. రాజగోపాల్ రెడ్డి ఎపిసోడ్ పై మంత్రి స్పందించారు. నేను మా సోదరుడికి మంత్రి పదవి ఇప్పించే స్టేజ్ లో లేను. కేంద్ర పెద్దలు మాటిచ్చిన విషయం నాకు తెలియదు. నా చేతుల్లో ఏం లేదు. అధిష్టానం, ముఖ్య మంత్రి మంత్రి పదవుల విషయంలో నిర్ణయాలు తీసుకుంటారు. నేను ఢిల్లీకి రాలేదు. మంత్రి పదవి అడగలేదు అని స్పష్టం చేశారు. తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల 30శాతం వేతన పెంపు డిమాండ్‌తో జరుగుతున్న సమ్మె వివాదంపై కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. ఈ సమస్య పరిష్కారం కోసం ప్రముఖ నిర్మాత దిల్ రాజుకు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. కార్మికుల డిమాండ్లపై చర్చిం చి తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన సూచించారు. కార్మికులకు జీతాలు పెంచాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్‌లో బతకాలంటే జీతాలు పెరగాలి. ఢిల్లీ పర్యటన తర్వాత నేను కార్మికులతో నేరుగా మాట్లాడతాను. ఈ అంశాలన్నిటినీ దిల్ రాజుకు అప్పగించాము. ఆయన ప్రొడ్యూసర్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నారుని వెల్లడించారు. ఆయన మరింత మాట్లాడుతూ, 'పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నారు. టికెట్ ధరలు పెంచేందుకు మేము అనుమతులు ఇస్తున్నాము. కాబట్టి, కార్మికులు అడుగుతున్న డిమాండ్లపై చర్చించి, నిర్మాతలు తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు.

## మరిన్ని సుంకాలు పెంచుతాం

**భారత్‌కు ట్రంప్ హెచ్చరికలు**

**వాషింగ్టన్- నేటి ప్రభాత సూర్య :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ట్రంప్ విధించిన 25 శాతం సుంకాల నిర్ణయం అమలులోకి వచ్చింది. 6వ తేదీ నుంచి భారతీయ సరుకులపై ఈ సుంకాల వసూళ్లు ఆరంభం అవుతాయి. అయితే మరోసారి ట్రంప్ సుంకాల పెంపు విషయంలో మరోసారి కఠిన నిర్ణయం తీసుకున్నారు. రానున్న 24 గంటల్లో భారత్‌పై సుంకాలను గణనీయంగా పెంచుతామని ఓ అంతర్జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ తెలిపారు. ఆమెరికాకు భారత్ మంచి వాణిజ్య భాగస్వామి కాదన్నారు. అమెరికాతో భారత్ పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తుంది. కానీ, అమెరికా మాత్రం భారత్‌తో వ్యాపారం చేయదని స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొను గోలు చేస్తోందని.. తద్వారా ఉక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందని ఆక్రోశాన్ని వెళ్లగక్కారు.

## కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్

- లీకులు ఇచ్చి వార్తలు రాయించుకుంటున్నారు
- అసెంబ్లీలో చర్చ పెడితే ఎండగడతాం: కెటిఆర్



**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** కాళేశ్వరం నివేదికలో మొత్తం గ్యాస్, ట్రాష్ మాత్రమే తప్ప అందులో ఏమీ లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. 650 పేజీల పూర్తి నివేదిక ఎవరూ చదవక ముందే అడ్డమైన రోత వార్తలను రెండు పత్రికలు రాస్తున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 655 పేజీల కమిషన్ నివేదికను 60 పేజీలకు కుదించడంలోనే కాంగ్రెస్ భాగోతం అర్థమైందని విమర్శించారు. 600 పేజీల్లో వారికి ఇష్టమైనవి లేవు అని, ఆ 60 పేజీల్లో మాత్రమే వారికి ఇష్టమైనవి ఉన్నాయని, అందుకే వాటిని మాత్రమే బయటపెడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించిన సమావేశానికి కెటిఆర్ నేతృత్వంలో ప్రతినిధి బృందం హాజరైంది. ఈ సమావేశంలో కెటిఆర్‌తో పాటు రాజ్యసభ సభ్యులు కె.ఆర్ సురేష్ రెడ్డి, వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎంపీలు బోయినపల్లి వినోద్ కుమార్, బాల్క సుమన్ పాల్గొన్నారు. అనంతరం ఢిల్లీలో కెటిఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం నివేదికపై ప్రశ్నకు సమాధాన ఇస్తూ.. సాయంత్రం కమిషన్ రిపోర్ట్ వస్తే అర్ధరాత్రి ఆస్థాన మీడియాకు లీకులు ఇచ్చారని, తెల్లారి అబద్దాలను ప్రచారంలో పెట్టారని మండిపడ్డారు. దమ్ముంటే మొత్తం 655 పేజీల నివేదికను ప్రజల ముందు పెట్లాలని డిమాండ్ చేశారు. ఉద్దేశ పూర్వకంగా కెసిఆర్‌పై, బిఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుందని, అసెంబ్లీలో మైకులు కట్ చేయకుండా తమను అసెంబ్లీలో మాట్లాడనిస్తే ప్రభుత్వంతో ఫుట్‌బాల్ ఆడుకుంటామని అన్నారు. అసెంబ్లీలో తమ మైకులు కట్ చేయకుండా తమను మాట్లాడిస్తే ఎవరు నిజం చెబుతున్నారు... ఎవరు అబద్ధం చెపుతున్నారో తెలిసిపోతుందని, కాంగ్రెస్ పార్టీకీ దమ్ముందా.. అంటూ కెటిఆర్ సవాల్ విసిరారు.

## బండి సంజయ్‌కు మరోమారు సిట్ నోటీసులు

**8న విచారణకు రావాలని ఆదేశం**



**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ పాలిటిక్స్‌లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ సిట్ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఆగస్ట్ 8వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ కేసులో సాక్షిగా వాంగ్మూలం ఇవ్వాలని సిట్ కోరింది. ఈ మేరకు విచారణకు హాజరు అవుతానని సిట్‌కు బండి సంజయ్ రిప్లై ఇచ్చినట్లు- తెలిసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని పలుమార్లు బండి సంజయ్ ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై అప్పట్లో ఆయన పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచిన సిట్ ఇప్పటికే పలువురు రాజకీయ నాయకుల స్టేటెమంట్లను రికార్డ్ చేసింది. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఫహీం ఖురేషి తదితర నేతల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. ఇందులో భాగంగా గతంలోనే బండి సంజయ్‌కు కూడా సిట్ నోటీసులు జారీ చేసింది. ముందస్తు షెడ్యూల్ వల్ల బండి సంజయ్‌కు సిట్ విచారణకు హాజరు కాలేదు. దీంతో ఆగస్ట్ 8వ తేదీన విచారణకు హాజరు కావాలని తాజాగా సిట్ మరోసారి నోటీస్ జారీ చేసింది.



## బిజెపి వైపు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు

**త్వరలోనే పార్టీలో చేరుతారని ప్రచారం**

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** కాళేశ్వరం కమిషన్ రిపోర్టుతో ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ పార్టీకి మరో సంక్షోభం వచ్చి పడింది. ఆ పార్టీకి చెందిన పది మంది మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు రెడీ అవుతున్నారు. వీరిలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరు బీజేపీ వైపు అడుగులు వేస్తున్నట్టు సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో చిక్కిన నలుగురు మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, రేగా కాంతారావు, పైలట్ రోహిత్ రెడ్డి కూడా పార్టీలో బీజేపీలో చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. అదే విధంగా ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాలకు చెందిన కీలక నేతలు బీజేపీ వైపు చూస్తున్నట్టు- సమాచారం. ఈ నెల 9న నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఢిల్లీలో బీజేపీ కీలక నేతల బీఎల్ సంతోష్ సమక్షంలో కాషాయ కండువా కప్పుకొనేందుకు రెడీ అయిపోయారని సమాచారం. వీరిలో నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఇద్దరు ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే ఉన్నట్టు తెలుస్తోంది. రెండో దఫాలో మరో ఆరుగురు బీజేపీలో చేరుతారని సమాచారం. అయితే బీజేపీతో ఇప్పటికే చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేషన్ ఫాంహౌస్ కేసులో పాల్గొన్న నేతలంతా బీఎల్ సంతోష్‌తో మంతనాలు సాగించినట్టు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మరో మాజీ ఎమ్మెల్యేతో పాటు మరో ఇద్దరు కీలక నేతలు కారు దిగుతారని సమాచారం.

# సంపాదకీయం

## కన్నడనాట అత్యాచార కాండ !

ధర్మస్థలి.. ప్రజ్వల్ రేవణ్ణ ఈ రెండు పేర్లు దేశానికి ఇప్పుడు బాగా తెలిసిపోయాయి. ముఖ్యంగా కర్నాటక ప్రజల నోళ్లల్లో నిత్యం నానుతున్న పేర్లుగా చెప్పుకోవాలి. రెండూ ఒకే తరహా కేసులుగా చూడొచ్చు. ధృస్థలిలో అమ్మాయిలపై అత్యాచారం చేసి చంపేస్తున్నారని, అదృశ్యం అయిన కేసుల్లో ఇప్పటికీ ఆచూకీ దక్కలేదని గుర్తించారు. అనేకమంది అమ్మాయిల మరణాలు ఇప్పటికీ మిస్టరీగానే ఉన్నాయి. ఒకరిద్దరు మాత్రమే ఫిర్యాదు చేశారు. వాటిపై చర్యలు తీసుకోలేదు. ఈ విషయంలో నాటి బిజెపి ప్రభుత్వం, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా సీరియస్‌గా లేవు. అందుకే ప్రజల్లో ఉన్న సీరియస్ నెస్ ఇక్కడ కానరావడం లేదు. అందుకే దర్యాప్తు నత్తనడకన సాగిస్తున్నారు. సిట్‌ను వేసినా పెద్దగా ఉపయోగం లేదన్న చర్చ కూడా మొదలయ్యింది. ధర్మస్థలి వ్యవహారంలో పెద్ద తలకాయలు ఉన్నాయని, మాఫియా ఉందని అంటున్నారు. బాగా పలుకుబడి ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండడంతోనే అసలు నిజాలు బయటకు రావడం లేదని తెలుస్తోంది.

అయితే ఈ కుంభస్థలం ఎప్పుడో బద్దలు కాక తప్పదు. మాజీ సానిటేషన్ ఉద్యోగి ఇచ్చిన ఫిర్యాదుతో కొంత కదలిక వచ్చినా, పాలకుల్లో ఏ మాత్రం చిత్తశుద్ధి లోపించినా దర్యాప్తు ముందుకు సాగదు. ఇకపోతే ప్రజ్వల్ రేవణ్ణ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఓ మాజీ ప్రధాని దేవగౌడ కుమారుడిగా, ఎంపిగా సాగించినా అత్యాచారకాండ అంతాఇంతా కాదు. దీనిపై చర్చించడం కూడా అవసరం. ఇలాంటి దగుల్బాజీల పాపం పండి జైలు శిక్ష పడింది. లేకపోతే మరింతగా విర్రవీగేవారు. ఎన్‌డిఎ కూటమి పార్టీ జెడిఎస్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక దాడి కేసులు నమోదైనప్పుడు కనీసమాత్రంగా కూడా నేతలు స్పందించలేదు. ప్రజల్వాల్ తీర్పును స్వాగతించలేదు. న్యాయస్థానం శిక్ష విధించాక కూడా మోడీ నుంచి కాని, బిజెపి నుంచికాని ఎలాంటి స్పందన లేదంటే మహిళలపై నేరాలకు పాల్పడ్డ వారికి మద్దతిచ్చినట్లుగా భావించాలి. ప్రజ్వల్‌పై ఒక కేసులోనే శిక్ష పడింది. మరిన్ని కేసులు విచారణలో ఉన్నాయి. వాటిలోనూ బాధితులకు న్యాయం జరిగేలా, నిందితునికి శిక్ష పడేలా అన్ని వ్యవస్థలూ పని చేయాలి. రాజకీయ పలుకుబడి, డబ్బు ఉన్న ప్రజ్వల్ పైకోర్టులను ఆశ్రయించే అవకాశం లేకపోలేదు. తప్పించుకోకుండా పోలీసులు, బాధితులు అప్రమత్తంగా ఉండాలి. ఇకపోతే కేసు వివరాల్లోకి వెళితే..ప్రజ్వల్ రేవణ్ణ నిజంగానే ఓ దుర్మార్గుడు. ఎందరో మహిళల మానాలను దోచుకున్న దుండగుడు. అతనికి జీవితఖైదు విధించడం సరైనదే. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ జరాలి. ఇకపోతే రేవణ్ణ కేసులు చూస్తే ఆశ్చర్యం కలగమానదు. ఇంట్లో పనిమనిషిపై పలుమార్లు అత్యాచారం జరిపిన కేసులో అభియోగాలు రుజువు కావడంతో మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణకు బెంగళూరు ప్రజాప్రతినిధుల న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ప్రజ్వల్‌ను దోషిగా నిర్ధారించిన కోర్టు, యావజ్జీవంతోపాటు 11.35 లక్షల రూపాయలు జరిమానా విధించి, దానిలో 11 లక్షలు బాధితురాలికి చెల్లించాలని కోర్టు ఆదేశించింది. మహిళలను కట్టుబానిసలుగా, వారిని సెక్స్ వర్కర్లుగా చూస్తున్న ప్రస్తుత సమయంలో న్యాయస్థానం వెలువరించిన ఈ తీర్పు మహిళలకు ఆశాకిరణం. రోజురోజుకు స్త్రీలపై అఘాయిత్యాల పరంపర కొనసాగుతున్న వేళ మహిళల్లో ఆత్మవిశ్వాసం నింపిందనే చెప్పాలి.

ప్రజ్వల్‌పై మూడు లైంగిక దాడి కేసులు, ఒక లైంగిక వేధింపుల కేసు నమోదుకాగా మొదటి కేసులోనే శిక్ష పడింది. మిగతా కేసులు విచారణలో ఉన్నాయి. మైసూర్ ఆర్‌కె నగర్‌కు చెందిన ఒక మహిళ తనపై ఫాంహౌస్‌లో ప్రజ్వల్ పలుమార్లు అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేయడంతో తొలికేసు నమోదైంది. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండవ తడవ హసన్ నియోజకవర్గం నుంచి ప్రజ్వల్ ఎంపి అభ్యర్థిగా పోటీ చేశారు. పోలింగ్ ముగిశాక కేసు నమోదు కావడంతో జర్మనీకి పారిపోయాడు. ప్రత్యేక దర్యాప్తు బృందం అతన్ని స్వదేశానికి రప్పించి గతేడాది మే 31న అరెస్ట్ చేసింది. అప్పటి నుంచి రిమాండ్ ఖైదీగా ప్రజ్వల్ జైలు ఊచలు లెక్కిస్తున్నాడు. కేసు దర్యాప్తు సమయంలో సిట్ కనుగొన్న విషయాలు విస్తుగొల్పేలా ఉన్నాయి. ప్రజ్వల్ రేవణ్ణ ప్రజాప్రతినిధిగా సమస్యలపై తన దగ్గరకొచ్చే మహిళలపై లైంగికదాడికి ఒడిగట్టాడు. బెదిరించో బలవంతంగానో లోబరుచుకునో లైంగిక దాడులకు బరితెగించాడు. అత్యాచారం చేసిన ప్రతిసారీ తన ఐ-ఫోన్‌లో ఆ దృశ్యాలను తానే రికార్డు చేసుకున్నాడు. అటువంటి రెండు వేలకు పైచిలుకు వీడియోల ను దర్యాప్తు సందర్భంగా ప్రజ్వల్ ఫోన్‌లో కనుగొన్నారు. అవి మార్ఫింగ్ వీడియోలుగా, రాజకీయ కుట్రగా ప్రజ్వల్ బుకాయించి,తప్పించుకోచూశాడు. అయితే అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీడియోలను విదేశాలకు పంపి, ఫోరెన్సిక్ పరీక్షలు చేయించి నిజమైనవేనని నిర్ధారించారు. కేవలం 14 మాసాల్లోనే కేసు ఛేదించడం వెనుక దర్యాప్తు అధికారుల కృషి, కోర్టులో వాదనల సందర్భంగా ప్రాసిక్యూషన్ కనబరిచిన చాకచక్యం అభినందించాల్సిందే. ఇవన్నీ కలిసి ప్రజ్వల్‌ను బోనులో దోషిగా నిలబెట్టాయి. అన్నింటికీ మించినది న్యాయం కోసం, దోషికి శిక్ష పడాలని బాధితురాలు కనబర్చిన పట్టుదల మహిళాలోకానికి స్ఫూర్తినిస్తుంది.

ప్రజ్వల్ రేవణ్ణ సాదాసీదా యువకుడు కాదు. కర్ణాటక రాజకీయాలను శాసిస్తున్న కుటుంబానికి చెందిన మాజీ ఎంపి. ఆయన తాత దేవెగౌడ మాజీ ప్రధాని, పినతండ్రి కుమార స్వామి కేంద్ర మంత్రి, తండ్రి మాజీ రాష్ట్ర మంత్రి, ప్రస్తుత ఎంఎల్‌ఎ హెచ్‌డి రేవణ్ణ, తల్లి భవానీ గతంలో కార్పొరేటర్, సోదరుడు సూరజ్ ఎంఎల్‌ఎ. ఇంతమంది రాజకీయ కుటుంబంలో ఉన్న ప్రజల్వల్ తనకు తిరుగులేదని భావించాడు. అత్యాచార బాధితురాలిని అపహరించిన ప్రజ్వల్ తల్లి భవానీపైనా కేసు , ప్రజ్వల్ తండ్రి హెచ్‌డి రేవణ్ణపై కూడా లైంగిక వేధింపుల ఆరోపణల కేసు నమోదయ్యాయంటే బాధితులను ప్రజ్వల్ కుటుంబం తమ రాజకీయ పలుకుబడితో ఏ స్థాయిలో భయభ్రాంతులకు గురి చేసిందో తెలుస్తుంది. అయితే పాపం పండింది. ప్రజ్వలు ఎంతగా మొత్తుకున్నా సాక్ష్యాలు బలంగా ఉన్నాయి. అత్యాచారాలు చేసి పైశాచికానందం పొంది, వాటిని సెల్ ఫోన్లలో వీడియోలు తీసి మురిసి పోయిన ప్రజ్వల్ లాంటి వారికి జీవిత ఖైదు సరిపోదు. అలాగే ధర్మస్థలిపైనా నిజాయితీగా విచారణ జరగాలి. అప్పుడే ప్రజల్లో భరోసా వస్తుంది. కర్నాటక కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధని చాటుకోవడానికి ఇదో మంచి అవకాశం. రాజ్యాంగం పుస్తకాన్నిపట్టుకు తిరుగుతున్న రాహుల్ ఈ విషయంలో తమ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి ధర్మస్థలి విషయంలోనూ నిగ్గు తేలేలా చేస్తే మంచిది.


# గువ్వలా ఎగిరిపోతున్న బాలరాజు

## కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తున్నట్లు చర్చ



**మహబూబ్‌నగర్- నేటి ప్రభాత సూర్య :** ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాజీనామా చేయడం వెనక ఏమై ఉంటుందా అని అంతా చర్చిస్తున్నారు. ఇప్పుడే బిఆర్‌ఎస్‌కు రాజీనామా చేయడంలో ఆంతర్యమేమిటో తెలియడం లేదు. అయితే ఆయన అధికార కాంగ్రెస్‌లోకి వెళతారన్న ప్రచారం కూడా ఉంది. ఇకపోతే బీఆర్‌ఎస్ పార్టీపై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు ఉంటుందని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత చెప్పినట్లుగానే పరిణామాలు ఉంటున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్‌లో పరిణామాలు చూస్తుంటే పొత్తు పెట్టుకున్నా ఆశ్చర్యం లేదని ఆక్షేపించారు. బీఆర్‌ఎస్, బీజేపీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత లాంటి నేతలు కూడా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్‌లో తనకు భవిష్యత్తు లేదనే అసంతృప్తితోనే రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. మంగళవారం గువ్వల బాలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు తనకు టచ్‌లోకి వచ్చిన మాట వాస్తవమని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటా నని తెలిపారు. బీఎల్ సంతోష్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని చెప్పుకొచ్చారు. అప్పట్లో బీఎల్ సంతోష్ ఎవరో కూడా తనకు తెలియదని గువ్వల బాలరాజు అన్నారు. కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను మాత్రమే తాను పూర్తి చేశానని క్లారిటీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకత్వం.. ప్రజల్లో బలం లేని రెడీమేడ్ లీడర్స్‌ను నమ్ముకుంటుందని వ్యాఖ్యానించారు. జనరల్ నియోజకవర్గాల్లో దళితులకు సీట్లు ఇచ్చే దమ్ము బీఆర్‌ఎస్‌కు ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏడాదిన్నర కాలంగా బీఆర్‌ఎస్‌లో తనకు ప్రాధాన్యం తగ్గించారని గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. గువ్వల బాలరాజు బీఆర్‌ఎస్ కార్యకర్తతో మాట్లాడినట్లుగా ఓ ఫోన్ కాల్ వైరల్ అవుతోంది. ఈ ఫోన్ కాల్‌లో ఏం మాట్లాడరంటే.. 'బీజేపీతో బీఆర్‌ఎస్ పొత్తు పెట్టుకుంటుందని లేదా విలీనం అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అలాంటప్పుడు మన అభ్యర్థిత్వం ఎగిరిపోతుంది. గతంలో బీజేపీతో నేను పోరాటం చేశా. బీఆర్‌ఎస్ కంటే ముందే నా దారి నేను చూసుకుని.. బీజేపీలో కలవడం మంచిదని నిర్ణయం తీసుకున్నా. పార్టీలో నన్ను కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చారు. ఆ విషయం ఎంతో బాధించిందని గువ్వల బాలరాజు మాట్లాడుతు న్నట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనినిబట్టి ఆయన కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని అంటున్నారు. ఇకపోతే జిల్లాకు చెందిన సిఎంగా రేవంత్ ఉండడంతో ఆయన అటువైపు మొగ్గు చూపుతున్నారని కూడా ప్రచారం. మొత్తంగా ఎటు వెళ్లినా ఇప్పటికిప్పుడు గువ్వలకు వచ్చే ఉపయోగం ఏమీ ఉండకపోవచ్చు.

# ఢిల్లీకి టెస్లా!



**హస్తినలో టెస్లా రెండో అడుగు**
**ముంబై తరవాత ప్రారంభానికి సిద్దం**
**11న షోరూమ్ ప్రారంభానికి నిర్ణయం**

**న్యూఢిల్లీ - నేటి ప్రభాత సూర్య :** ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా అధికారికంగా భారత విపణిలోకి ఇప్పటికే అడుగుపెట్టింది. గత నెల 15న ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. ఇప్పుడు రెండో షోరూం ప్రారంభించేందుకు టెస్లా సిద్ధమైంది. దేశ రాజధాని ఢిల్లీలో తన సెకెండ్ షోరూంను తెరవబోతోంది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో గల ఏరోసిటీలో టెస్లా సెకెండ్ షోరూంను ఆగస్టు 11న ఓపెన్ చేయనుంది.ఇందుకోసం వరల్డ్ మార్క్ కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల స్థలాన్ని టెస్లా సంస్థ లీజుకు తీసుకున్నట్లు తెలిసింది. పార్కింగ్ సౌకర్యాలుగల ఈ షోరూమ్ స్పేస్‌కుగాను నెలకు రూ.25 లక్షలు అద్దె చెల్లించేలా కంపెనీ ప్రమోటర్, బిలియనీర్ ఎలాన్ మస్క్ డీల్ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. రియర్‌వీల్ డ్రైవ్, లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధి కారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో18శాతం జీఎస్టీతో సహా రూ.50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది. ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమత య్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ. 38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది. అయితే టెస్లాపై మోజుతో ఇండియాలో మార్కెట్ పెరుగుతందని భావిస్తున్నారు.

# అద్వానీ రికార్డు బ్రేక్

**అత్యధిక కాలం హోంమంత్రిగా అమిత్ షా**

**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** ప్రధానిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించినట్లుగానే హోంమంత్రి అమిత్ షా కూడా అత్యధిక కాలం హోంమంత్రిగా రికార్డు సృష్టించారు. ఎలాంటి విరామం లేకుండా దేశాన్ని అత్యధిక కాలం పరిపాలించిన ప్రధానిగా ఇందిరాగాంధీ పేరుతో ఉన్న రికార్డును మోదీ అధిగమించారు. మోదీ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా సైతం ఓ సరికొత్త రికార్డు నెలకొల్పారు. దేశ చరిత్రలో ఎవరూ అందుకోలేని అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. దేశ చరిత్రలో అత్యధిక



కాలం కేంద్ర హోంశాఖమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. ఇప్పటి వరకూ బీజేపీ అగ్ర నేత ఎల్‌కే అద్వానీ పేరుతో ఉన్న రికార్డును షా బద్దలు కొట్టారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక అమిత్‌షా 2019లో కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. ఐదు సంవత్సరాల పదవీకాలాన్ని పూర్తి చేశారు. ఆ తర్వాత జరిగిన 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చింది. దీంతో షా వరుసగా రెండోసారి కూడా హోంశాఖ బాధ్యతలనే స్వీకరించారు. దీంతో షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించి నేటికి ఆరు సంవత్సరాల 64 రోజులు పూర్తైంది. దాదాపు 2,194 రోజులు అమిత్ షా హోం మంత్రిగా పనిచేశారు. ఫలితంగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ రికార్డును షా బద్దలుకొట్టారు. 1998-1999, 1999-2004 వరకూ ఎల్‌కే అద్వానీకేంద్ర హోం మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. దాదాపు 2,193 రోజులు అద్వానీ ఈ పదవిలో కొనసాగారు. ఇప్పుడు ఆ రికార్డును అమిత్ షా అధిగమించారు.



# బీహార్ ఓటు సవరణపై నిరసనలు

**పార్లమెంట్ ముందు ఇండియా కూటమి ఆందోళన**

**న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :** బీహార్‌లో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ పలువురు ఇండియా బ్లాక్ నేతలు పార్లమెంటులో నిరసన చేపట్టారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరుసగా పదవరోజైన మంగళవారం కూడా ప్రతిపక్షాలు నిరసనలు చేపట్టాయి. పార్లమెంట్ మకరద్వారం సమీపంలో చేపట్టిన నిరసనలో వామ పక్షాలు, డిఎంకె, టిఎంసి ఎంపిలు సహా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా, ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. 'మన ఓటు. మన హక్కు. మన పోరాటం', 'ఎస్ఐఆర్ సైలెంట్ ఇన్విజబుల్ రిగ్గింగ్' అని రాసి వున్న బ్యానర్లు ప్రదర్శించారు. 'స్టాప్ ఎస్ఐఆర్' ప్లకార్డులు, పోస్టర్లను ప్రదర్శించడంతో పాటు పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఓటర్ల ఓటు హక్కును తొలగించడం లక్ష్యంగా ఇసిఐ కసరత్తు చేపడుతోందని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఎస్ఐఆర్‌పై చర్చ చేపట్టాలంటూ పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలు ఆందోళన చేపడుతున్న సంగతి తెలిసిందే. అయితే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి శిబు సోరెన్ మరణించడంతో సోమవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టలేదు.

# పత్రికలు సమాజానికి దర్పణం లాంటివి

- మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి
- 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణలో వెంకయ్యనాయుడు

**హైదరాబాద్- నేటి ప్రభాత సూర్య :** పత్రికలు సమాజానికి దర్పణం లాంటివని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'విలీనం-విభజన' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సమాజంలోని అవినీతిని ప్రజలకు జర్నలిస్టులు వివరించాలి. నిజాన్ని తెలియజేసి తీర్పును ప్రజలకే వదిలేయాలి. మనం మాట్లాడే భాష హుందాగా ఉండాలి. గతంలో బూతులు మాట్లాడిన నేతలు ఎవరూ గెలవలేదు. అలాంటి వారిని నిలువరించాలని ఓ మహిళ నాతో అన్నారు. పోలింగ్‌బూత్‌ల ద్వారా బూతు నేతల నోరు మూయించాలని ఆమెకు చెప్పానని వెంకయ్యనాయుడు అన్నారు. భాష విషయంలో నాయకుల తీరు మారాలని వెంకయ్యనాయుడు సూచించారు. సీనియర్ సంపాదకులు ఐ.వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం - విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను



ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

**సిపిఐ మండల కార్యదర్శి చొక్కల్ల శ్రీశైలం.**

**తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేత...**



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:** రైతులకు యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి చొక్కల శ్రీశైలం అన్నారు. మంగళవారం మండల తాసిల్దార్ కు సిపిఐ శ్రేణులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం మండల కేంద్రంలోని సొసైటీ కి మాత్రం యూరియా కేటాయించడం మూలంగా రైతులు గ్రామాల నుండి మండల కేంద్రానికి రావడానికి రోడ్డు సౌకర్యం లేక నానా పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు అన్ని గ్రామాలలోని ఫర్టిలైజర్ షాపులలో యూరియా కొరత లేకుండా కేటాయించి రైతులకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కూన మల్లయ్య, పిప్పళ్ళ కనకయ్య, బోయిన మల్లయ్య, బొమ్మ కంటి అంజయ్య, చారి, నయిం, రాపోలు రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయుడి ఆరాధనలో అంగరంగ వైభవం





**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 5):** షాద్ నగర్ పట్టణంలో 13 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో శివ మారుతి అయ్యప్పస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా 13 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరిగింది. ఈ ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు, అర్చకులు, తదితరులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య, గ్రంథాలయ కమిటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, చెంది తిరుపతిరెడ్డి, దాస కృష్ణయ్య, వీరేశం మురళీమోహన్ (అప్పి), పాండు నీరటి వాసు, మాణిక్యం గోపాల్, ఆనంద్, నల్లమోని శ్రీధర్, పోలేపల్లి సందీప్ గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొని విజయవంతం చేశారు.

# ఆకెనపల్లిలో వైద్య శిబిరం

**మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాత సూర్య ఆగస్టు 5:**



బెల్లంపల్లి మండలంలోని తాళ్లగురజాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆకెనపల్లి సబ్‌సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలోని మన్నెపువాడలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామ ప్రజలకు రక్తపోటు, మధుమేహం, జ్వరం, దగ్గు వంటి లక్షణాలపై వైద్యులు పరీక్షలు నిర్వహించారు. పిల్లలు, గర్భిణీలు, వృద్ధులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. సీజనల్ వ్యాధులు, ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల నుండి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, శుభ్రత పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ కొలుగూరి పూజ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం నల్ల తిరుమల, ఆశావర్కర్ మానుగు సుగుణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్థానికులు ఈ శిబిరాన్ని అభినందిస్తూ, ఇటువంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు.

# బైక్ దొంగతనాల్లో నిమగ్నమైన నేరస్తుడు అరెస్ట్



**- నాలుగు బైకులు స్వాధీనం**

**- ప్రెస్ మీట్ లో వెల్లడించిన పోలీసు అధికారులు**

**షాద్‌నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ అల్వాల దర్శన్ గౌడ్ (ఆగస్టు5) :**

షాద్ నగర్ పోలీసుల సాంకేతిక ఆధారాలతో కేసు చేదించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని కోరియర్ కార్యాలయం వద్ద పార్క్ చేసి ఉంచిన ఫిర్యాదు దారుడి ద్విచక్ర వాహనం చోరీకి గురైన కేసును షాద్‌నగర్ పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించి విచారణ జరిపి, కేసును చేదించామని ఉన్నత పోలీసు అధికారులు మంగళవారం ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. కేసు వివరాలు...చేర్కుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు తన సొంత హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్ టీఎస్-07-ఎఫ్ జె-2739 ను 19.06.2025 ఉదయం 10 గంటలకు షాద్‌నగర్ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని కోరియర్ ఆఫీసు పక్కన పార్క్ చేసి ఉంచగా, అదే వాహనం 21.06.2025 సాయంత్రం 5 గంటలకు గమనించగా కనిపించక పోవడంతో షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి. పోలీసుల దర్యాప్తు చేశారు.కేసు దర్యాప్తులో భాగంగా, 04.08.2025న సాంకేతిక ఆధారాల ద్వారా నిందితుడిని గుర్తించి, కొర్రా వినోద్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. విచారణలో నిందితుడు తెలిపిన విషయాలు ఇంటి ముందు లేదా షాప్‌ల ముందు తాళాలు వేసి ఉన్న బైకులు లక్ష్యంగా ఎంచుకొని, చుట్టుపక్కల ఎవరూ లేని సందర్భంలో హ్యాండిల్ బలవంతంగా విరగొట్టి బైకులను దొంగిలించేవాడని అంగీకరించాడు. నిందితుడి నీ అరెస్టు చేసి రికవరీ చేసిన వివరాలు షాద్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు, 1. హెూండా షైన్,టీఎస్-07-ఈఎం-1079,2 .యూనికాన్ టీఎస్-11-ఈ ఎం-0679, 3.గ్లామర్ టీఎస్-06- ఈ యు-337,,4.హీరో స్ప్లెండర్ ప్లస్ టీఎస్-07-ఎఫ్ జె-2739 మొత్తం రికవరీ విలువ, రూ. 2,00,000/- (రెండు లక్షల రూపాయలు)నిందితుడి కొర్రా వినోద్ నేర చరిత్ర ఇప్పటికే పలు చోరీ కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయ్యి జైలుశిక్ష అనుభవించాడు. ఇతడు ఇప్పటి వరకు 11 బైక్ దొంగతనాలకు పాల్పడ్డాడు. ఇతని వివరణ ఇలా ఉంది, షాద్‌నగర్ పిఎస్ పరిధిలో 04 కేసులు ఆర్.జి.ఐ.పి.ఎస్ పరిధిలో, 01 కేసు కొత్తూర్ పిఎస్ పరిధిలో, 04 కేసులు, హైదరాబాద్ అఫ్జల్ గంజ్ పోలీస్ పరిధిలో 02 కేసులు ఉన్నట్లు తెలిపారు.కేసు ఛేదనలో సహకరించిన పోలీసులు ఈ కేసును శంషాబాద్ డిసిపి రాజేష్ పర్యవేక్షణలో, అడిషనల్ డీసీపీ కె.పూర్ణచందర్ , షాద్‌నగర్ ఏసిపి ఎస్. లక్ష్మినారాయణ, ఈ కేసు మార్గనిర్దేశంలో, ఇన్‌స్పెక్టర్ పి. విజయ్ కుమార్, ఐడి ఎస్. వెంకటేశ్వర్లు, ఆధ్వర్యంలో, కేసు విచారణాధికారి క్రైమ్ డి ఎస్ ఐ జి. శివ రెడ్డి మరియు క్రైం టీమ్ సభ్యులు రవీందర్, సంతోష్, కర్ణాకర్, జాకీర్, రాజు, అహర్నిశలు శ్రమించి కేసు ఛేదించారు. వీరికి ఉన్నతాధికారులచే రివార్డులు అందజేయనున్నారు అని పోలీస్ అధికారులు తెలిపారు.

# భార్య విడిచి వెళ్లడంతో మనస్తాపం .. వ్యక్తి ఆత్మహత్య

**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య ఆగష్టు. 5:** మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సెకండ్‌జోన్‌లో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు శనిగారపు కార్తీక్ (తండ్రి: పోశం) 2018లో హనుమకొండకు చెందిన లాస్యతో వివాహం చేసుకున్నాడు. వారికి ఏడేళ్ల కొడుకు ఆర్యన్, ఐదేళ్ల కూతురు ఆరాధ్య ఉన్నారు. గత నెల రోజులుగా దంపతుల మధ్య కలహాలు జరుగుతున్న నేపథ్యంలో భార్య ఇంటి నుంచి వెళ్లి తన తల్లివద్ద ఉంటోంది.ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపానికి గురైన కార్తీక్, సోమవారం మధ్యాహ్నం “నా భార్య రావడం లేదు” అంటూ బాధ వ్యక్తం చేసి ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసుకున్నాడు. పలుమార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, మంగళవారం ఉదయం అన్న శనిగారపు సాగర్, వదిన నిత్యతో కలిసి తలుపు తీసి చూడగా, కార్తీక్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు.వెంటనే అతడిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు



జరుపుతున్నట్లు ఎఎస్ఐ మాజీద్ ఖాన్ తెలిపారు.

# మందమర్రి బురదగూడెంలో గాజుల మహోత్సవం

**ఘనంగా అష్టలక్ష్మి, కామాఖ్య దేవి ఆలయంలో భక్తుల గాజుల కుంకుమార్చన పూజలు**



**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాత సూర్య ఆగష్టు. 5:** మందమర్రి బురదగూడెంలోని త్రిశక్తి అష్టలక్ష్మి మరియు కామాఖ్య దేవి ఆలయాల్లో మహంకాళి



దేవాలయంలో సోమవారం గాజుల మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొని అమ్మవారికి గాజుల కుంకుమార్చన చేశారు.ఆలయ పూజారి సతీష్ భవాని మాట్లాడుతూ, “శ్రావణ ఏకాదశి సందర్భంగా మహిళలు గాజుల పూజ చేయడం ద్వారా సౌభాగ్య వృద్ధి, ఆయురారోగ్యాలు కలుగుతాయి. ఈ పూజ వల్ల సకల అష్ట ఐశ్వర్యాలు లభిస్తాయని శాస్త్రోక్తంగా పేర్కొంటారు” అన్నారు. మహోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తుల ‘జై మహంకాళి’ నినాదాలతో మారుమ్రోగింది. పూజా అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. రంగురంగుల గాజులు, పసుపు-కుంకుమల సువాసన, మంగళ హారతులతో ఆలయ వాతావరణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

# నస్పూర్ సహారా కార్యాలయం ముందు డిపాజిట్ దారుల ఆందోళన

**మంచిర్యాల,నేటి ప్రభాత సూర్య ఆగస్టు 5:** నస్పూర్‌లోని సహారా ఇండియా కార్యాలయం ముందు మంగళవారం రోజున డిపాజిట్ దారులు భారీగా ఆందోళన చేపట్టారు. కాలపరిమితి ముగిసినా డిపాజిట్‌లను చెల్లించకపోవడంతో బాధితులు ప్లేకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సింగరేణి విశ్రాంత కార్మికులు, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, సీనియర్ సిటిజన్లు, అసంఘటిత రంగ కార్మికులు తమ చెమటోడ్చి కూడబెట్టిన లక్షల రూపాయలను సహారా ఇండియాలో భవిష్యత్ అవసరాల కోసం డిపాజిట్ చేశారని తెలిపారు. పాలసీలు మెచ్యూరిటీ అయ్యి ఏళ్లుగా గడిచినా డబ్బులు ఇవ్వకపోవడంతో ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన తమ పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.డిపాజిట్‌లు వెంటనే చెల్లించకపోతే ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కుటుంబాలతో కలిసి ఆత్మహత్యల దారిన నడవాల్సి వస్తుందని హెచ్చరించారు. సహారా బాధితుల సమస్యలపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు స్పందించి న్యాయం చేయాలని కోరారు.





ఈ కార్యక్రమంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, సహారా బాధితుల సంఘం నాయకుడు గజెల్లి వెంకటయ్య, బాధితులు బొద్దున దుర్గయ్య, మాచెర్ల శ్రీనివాస్, మోతె కాంతయ్య, మిట్ట రమాదేవి, డి. తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# శాఖాంబరి దేవిగా మానసా దేవి

**భక్తులతో కిక్కిరిసిన మానసా దేవి ఆలయం....**

**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**



శ్రావణమాస వేడుకల్లో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాసిం పేట మానసా దేవి ఆలయంలో మంగళవారం మానసా దేవి శాకంబరీ దేవిగా దర్శనం ఇచ్చారు. ఆలయంలోని మానసా దేవి, అపురూప లక్ష్మి, అమ్మ వాళ్లతో పాటు, సీతారామ లక్ష్మణ ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను, శ్రీ చక్రాన్ని కూరగాయలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రత్యేక కుంకుమార్చన,అభిషేకం కార్యక్రమాలు



నిర్వహించారు. శ్రావణ మాసంలో మంగళవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మ వాళ్ళ దర్శనానికి బారులు తీరారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఇబ్బంది కలవకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏలేటి చంద్ర రెడ్డి తెలిపారు.

# యూరియా కోసం రైతుల తిప్పలు



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రంలో యూరియా కోసం అన్నదాతలు మండుటెండలో పడిగాపులు కాస్తున్నారు. క్యూ లైన్ లో నిల్చున్న రైతులు, ఇంటి పనులు, వ్యవసాయ పనులు వదులుకొని రోజంతా క్యూ లైన్ లో నిలబడుతున్న రైతులు. ఒక రైతుకు రెండు యూరియా బస్తాలే ఇస్తున్నారని రైతుల ఆవేదన. అక్కడ రైతులు వేచి ఉండేందుకు ఎటువంటి నీడ సదుపాయం లేకపోవడంతో తమ వద్ద ఉన్న ఆధార్ కార్డులను క్యూలో పెట్టి, యూరియా కోసం వేచి చూస్తున్నారు.

# గ్రామాల అభివృద్ధి బిజెపితోనే సాధ్యం- తిప్పర్తి నికేష్



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:** గన్నేరువరం మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు తిప్పర్తి నీకేష్ ఆధ్వర్యంలో బిజెపి - మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంచుతూ బిజెపి కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించారు. బిజెపి మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని, బిజెపితోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరికీ లబ్ధి చేకూరిందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు పుల్లెల రాము, మునిగంటీ సతయ్య, అటికం రామచంద్రం, కూర రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయ స్వామి అనుగ్రహంతో అందరికి మంచి జరగాలి

**ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్ట్ 5) :** ఆంజనేయ స్వామి అనుగ్రహంతో ప్రజలందరికి మంచి జరగాలనీ ఎమ్మెల్సి నవీన్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణం లో శివ మారుతి అయ్యప్పస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి విగ్ర ప్రతిష్ట మహెూత్సవ మరియు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. ఈ కార్యక్రమం లో ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు యన్. రఘునాథ్ యాదవ్, దినేష్ సాగర్, వెంకటేష్, శివ చారి,సుధీర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

**- మండల వ్యవసాయ అధికారి రవినాథ్**

**- రైతుల పొలంబడి కార్యక్రమాన్ని విజయవంతం**



**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 05):**
రైతులు కూరగాయల సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ రవినాథ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో చౌదర్పల్లి గ్రామంలో కూరగాయల రైతుల పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ వారి కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం, హైదరాబాద్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సమన్వయంతో కూరగాయల సాగు చేసే రైతుల పొలంబడి కార్యక్రమంలో భాగంగా.. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారులు బసవ పున్నప్ప, పర్యవేక్షణ లో రైతు క్షేత్రశాల పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకట్ రెడ్డి ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి రైతులకు సమగ్ర సస్యరక్షణ అవసరం అనే అంశాన్ని వివరించారు. అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి ఉదయ శంకర్.. లింగ కర్షక, ఉత్తల ఉపయోగం సస్య సంరక్షణలో దాని ప్రాధాన్యతను వివరిస్తూ, పురుగుల గురించి వివరించారు. కూరగాయలు ఆకుకూరలు ఎలా సాగు చేయాలో, రైతు ఏ విధంగా అభివృద్ధి దశలో ఎదగాలని, మార్కెట్లో క్రయవిక్రయాలను తెలుసుకునేందుకు వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఓన్నప్ప గౌడ్, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి రాధా, వ్యవసాయ విస్తరణదికారి వసంత, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ పాలు అమృతం

**ఎలిమినేడు అంగన్వాడీలో తల్లిపాల వారోత్సవాలు**



**ఇబ్రహీంపట్నం-నేటి ప్రభాత సూర్య, జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 5)**
ఐసిడిఎస్ ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం మండలంలోని ఎలిమినేడు అంగన్వాడి సూపర్వైజర్స్ సరళ వనజ,రవలీల ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది ఆగస్టు 1 నుంచి తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమవుతాయి. బిడ్డ పుట్టిన గంటలోపే పాలిచ్చేలా తల్లికి సాయం చేయాలన్నదే వారోత్సవాల ఉద్దేశం. అమ్మపాలు అమృతం, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లి పాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, తల్లి పాలల్లో వివిధ రకాల పోషకాలుంటాయని,అవి శిశువు పెరుగుదలకు ఉపకరిస్తాయని తెలిపారు. ఆరు నెలల నిండిన పిల్లలను ఉద్దేశించి పౌష్టికాహారం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పద్మ, ఏఎన్ఎం, ఆశ వర్కర్స్ అంగన్వాడి చిన్నారులు పాల్గొన్నారు.

# పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల పంపిణీ






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):**
మాజీ మంత్రి లయన్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ దివంగత కోనేరు నాగేశ్వరావు 9వ వర్ధంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీనగర్ కాలనీ పంచాయితీ పారిశుధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కోనేరు పూర్ణచంద్రరావు సతీమణి సీనియర్ లయన్ కోనేరు పద్మ పాల్గొని మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సేవలు వెలకట్టలేనిదని వారికి ప్రభుత్వంతోపాటు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం అధ్యక్షులు లగడపాటి రమేష్ చంద్ లయన్స్ క్లబ్ సభ్యులు మొరిశెట్టి మోహన్ రావు కోనేరు నాగేశ్వరావు, మైనేని మోహన్ రావు కూర శ్రీధర్ చెరుకు శ్రీనివాస్ శ్రీశైలం జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు శిశువుకు అమృతతుల్యం

**చింతపల్లి -నేటి ప్రభాత సూర్య ఆగస్టు 5**
అమ్మ పాలు అమృతం, ఔషధంతో సమానమని, ఐసిడిఎస్ సిడిపిఓ సక్కుబాయి అన్నారు. మంగళవారం చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ ఆర్టీసీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన నవజాత శిశువుకు మొదటి ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలన్నారు. బిడ్డకు తల్లిపాలు అందించడం వల్ల గర్భాశయ రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. తల్లిపాలు తాగని పిల్లల్లో అనారోగ్యం, ఆకస్మిక మరణం, నేర్చుకునే సామర్థ్యం తగ్గడం, యుక్త వయసులో ఆరోగ్య సమస్యలు, ప్రమాదాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు బాదేపల్లి ప్రభావతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# మోడీ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

**- బిజెపి మండల అధ్యక్షుడు జరుపుల విజయ్ నాయక్**

**- నంది వనపర్తి లో బిజెపి ఇంటింటి ప్రచారం**

**- కరపత్రాల పంపిణీ**

**- బోసు పల్లి ప్రతాప్**



**యాచారం నేటి ప్రభాత సూర్య ( ఆగస్టు 05):**
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిధులతోనే గ్రామపంచాయతీల అభివృద్ధి కొనసాగుతుందని బిజెపి మండల అధ్యక్షుడు జరపుల విజయ్ కుమార్, బోసు పల్లి ప్రతాప్ అన్నారు. మంగళవారం మండల పరిధిలో నంది వనపర్తి గ్రామములో 30,31,32,33 బూత్ అధ్యక్షులు సురేష్, శ్రీకాంత్, మధుకర్, ఆధ్వర్యంలో బిజెపి ఇంటింటి కార్యక్రమాన్ని నిర్వహించారు. మోడీ సంక్షేమ పథకాల గురించి బిజెపి నాయకులు కరపత్రాలను పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. రానున్న స్థానిక ఎన్నికల్లో నంది వనపర్తి లో ఎంపిటిసి, సర్పంచ్, సొసైటీ డైరెక్టర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని నాయకులు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మేకల యాదగిరి రెడ్డి, మద్రిపల్లి అంజయ్య యాదవ్, నరేండ్ల వెంకట్ రెడ్డి, మాజీ బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్, ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోగికర్ రమేష్, మాజీ సర్పంచ్ దేరంగుల రాజు, రాయి కంటి విజయ్ కుమార్, కొండూరు రామ నాథం,కొండాపురం నాగరాజు,బాలరాజు,పాండు రంగారెడ్డి, పుప్పాల శాంతి కుమార్,మరగోని శేఖర్, దేవర కొండ ఈశ్వర్,సందీప్ రెడ్డి,జపాల శ్రీనివాస్, శివాజీ, సాయికుమార్,సంతోష్, జెనిగ నందు,కొండాపురం రమేష్,శ్రీకాంత్, సామ పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరూ చైన్ దొంగలు అరెస్ట్

**ఇబ్రహీంపట్నం-నేటిప్రభాతసూర్య,జోన్ ఇంచార్జ్(ఆగస్ట్ 5)**

ఇద్దరూ చైన్ స్నాచర్లను అరెస్టు చేసిన సంఘటన మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే ఇబ్రహీంపట్నం మండలం జాజుని బావి , పోల్కంపల్లి గ్రామానికి చెందిన లావణ్య భర్త శేఖర్, వయసు 33 సంవత్సరాలు, అనే మహిళ తేదీ 01.08.2025 మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో ఆమె ఒంటరిగా వారి పొలంలో బర్లను మేపుతుండగా అది గమనించిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆ మహిళ దగ్గరకు వచ్చి ఏదో అడ్రస్ అడిగి మెడపై కొట్టి మెడలో నుంచి పుస్తెలతాడు లాక్కొని వెళ్లే ప్రయత్నం చేసారు ఆ మహిళ భయపడకుండా ఆ తాడును గట్టిగా పట్టుకొని గట్టిగా అరవగా చుట్టుపక్కల వారు రావడం గమనించి ఆ పుస్తెల తాడును అక్కడే వదిలి దుండగులు పారిపోయారు. ఈ క్రమంలో ఆ మహిళకు మెడపైన గాయాలు అయ్యాయి. ఈ విషయంపై కేసు నమోదు చేసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆ ఇద్దరి వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి మీరు ఉపయోగించిన ఆర్ 15 వాహనాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.

నిందితులు మొదటి వ్యక్తి పేరు సంఘీ నాగరాజు, వయసు 25, నివాసం అల్మాస్గూడ బడంగ్పేట్, సొంత ఊరు తలకొండపల్లి, మహబూబ్నగర్ జిల్లా, ఇతను అమెజాన్ కంపెనీ శంషాబాద్ లో ప్యాకింగ్ బాయ్ గా పని చేస్తున్నాడు. తాను 2023 లో రేప్ కేసులో ఎల్బీ నగర్ పోలీస్ స్టేషన్ నుంచి జైలుకు వెళ్లి రావడం జరిగింది. ఆ తర్వాత చెడు వ్యసనాలకు బానిసై వచ్చే జీతం సరిపోక సులభంగా డబ్బులు సంపాదించాలని ఒంటరిగా ఉన్న మహిళలపై బంగారు ఆభరణాలను దొంగిలించాలని అనుకుని నెల క్రితం తనకు వేద వ్యాస్ అనే వ్యక్తి పరిచయం కాగా ఇద్దరు ఒకే రూములో ఉంటున్నారు. వేద వ్యాస్ అనే వ్యక్తి వయసు 24 సంవత్సరాలు సొంత ఊరు జడ్చర్ల, ఇతను షార్ట్ ఫిలిం వీడియోలు తీస్తూ ఉంటాడు.
వీరిద్దరూ చెడు వ్యసనాలకు బానిసై ఎలాగైనా డబ్బులు సంపాదించాలని ఒంటరిగా ఉన్న మహిళలపై బంగారు ఆభరణాలను దొంగలించాలని నిర్ణయించుకుని వేద వ్యాసు ఆర్ 15 వాహనం నెంబర్ ప్లేట్ తీసివేసి తేదీ 01.08.2025 మధ్యాహ్న సమయంలో ఇబ్రహీంపట్నం వైపు వచ్చి పోల్కంపల్లి ఏరియాలో ఒక మహిళ బర్లు మేపుతుండగా పుస్తెలతాడు లాక్కొని వెళ్లాలని ప్రయత్నించి ఆ మహిళ ధైర్యంగా ఎదిరించడం వల్ల అక్కడి నుండి పారిపోయారు.
ఈ కేసు నిమిత్తం గ్రామాల ప్రజలకు ఇబ్రహీంపట్నం పోలీసులు గ్రామ ప్రజలకు విజ్ఞప్తి . ఎవరైనా మహిళలు ఒంటరిగా వెళ్లేటప్పుడు మీకు గుర్తుతెలియని వ్యక్తులు మాస్కు ధరించి, వారు వచ్చిన వాహనానికి నెంబర్ ప్లేట్ లేకుండా ఎవరైనా వచ్చి ఏదైనా అడ్రస్ కానీ , మంచినీళ్లు గాని అడిగినట్లయితే వెంటనే అప్రమత్తమై దగ్గరలో ఉన్న వారికి తెలిసేలా తెలియ జేయండి లేదా పోలీస్ వారికి తెలియజేయాలని ఇబ్రహీంపట్నం సీఐ తెలిపారు.

# నూతన రేషన్ కార్డుల పంపిణీలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు




**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్- నేటిప్రభాత సూర్య (ఆగస్టు 5)**

పేదల అభ్యున్నతె లక్ష్యంగా ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు సగటున రూ. 1,200 విలువైన ఉచిత బియ్యాన్ని అందిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు జిల్లా ఇన్చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మల్లాపూర్లోని వైఎఆర్ గార్డెన్స్లో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలో ప్రభుత్వం పాలన సాగుతోందని, అందులో భాగంగా అర్హులైన పేదలకు రేషన్ కార్డులు జారీ చేయాలనే లక్ష్యంతో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్రంలో నెలకు రూ.61 కోట్ల 15 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ, పేదలకు అందించాలనే ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో 12 వేల కొత్త రేషన్ కార్డుల జారీతో సగటున 50 వేల మందికి సన్నరకం బియ్యం అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. గతంలో మా ప్రభుత్వం కృష్ణా నీటిని తీసుకొచ్చి హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య లేకుండా చేసిందని, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి గోదావరి నీటిని తీసుకురావడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతానికి కొత్త పరిశ్రమలను తీసుకువస్తున్నామని, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 65 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు రేషన్ కార్డులు అందించడం నిరంతర ప్రక్రియ అని, ఇంకా అర్హులైన వారిని కూడా త్వరలో గుర్తించి కార్డులు ఇస్తామని, వడ్డీ లేని రుణాల పథకంతో మహిళలకు కోట్ల రూపాయలు కేటాయించి, వారికి వ్యాపార నైపుణ్యాలలో శిక్షణ అందించి ఇందిర మహిళా శక్తి ద్వారా అనేక కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మహేశ్వరం, బాలాపూర్ మండలాల వారికి మంత్రి రేషన్ కార్డులు పంపిణీ చేసి, లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, టి యు ఎఫ్ ఐ టి సి చైర్మన్ చల్లా నరసింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య, కందుకూరు ఆర్డిఓ రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# జన్నారం: విద్యుత్ వైర్ల మరమ్మతు చేయాలన్న డిమాండ్



**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాత సూర్య , ఆగస్టు 5:**
జన్నారం మండలంలోని పొన్కల్ గ్రామ సుందరయ్య కాలనీలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ కేబుల్ వైర్లను తక్షణం సరిచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.
సోమవారం సీపీఎం మండల కార్యదర్శి కనికరపు అశోక్ నేతృత్వంలో పార్టీ నాయకులు సుందరయ్య కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సబ్స్టేషన్కు వెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.సుందరయ్య కాలనీ ఫైర్ స్టేషన్ వెనకాల గల సర్వే నంబర్లు 223, 3513, 5731, 5044 పరిధిలోని పలుచోట్ల విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని వారు తెలిపారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు కోరారు.

# మేడారం ఫ్లైఓవర్పై రోడ్డు ప్రమాదం .. వ్యక్తి మృతి





**మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాత సూర్య , ఆగష్టు. 5:**
మందమర్రి పోలీస్స్టేషన్ పరిధిలోని మేడారం ఫ్లైఓవర్పై మంగళ వారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెం దాడు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మహబూబ్నగర్ జిల్లా డోర్నకల్కు చెందిన కూనారపు వంశీ (32) తన అత్తగారి ఊరైన ఐబీ తాం డూర్కు ద్విచక్రవాహనంపై వస్తుండగా, మేడారం ఫ్లైఓ వర్పై తన బైక్ను పక్కకు ఆపాడు. ఈ సమయంలో మంచిర్యాల వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ, అతివేగంగా మరియు అజాగ్ర త్తగా నడిపిన కారణంగా వంశీ బైక్ను వెనుక నుంచి ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వంశీని తక్షణం మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మృతునికి భార్య స్వాతి (30), ఐదు నెలల బాబు ఉన్నారు.మృతుని భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

# లింగంపల్లి గ్రామంలో కొత్త కరెంట్ లైన్ ప్రారంభం



**మంచిర్యాల జిల్లా, నేటి ప్రభాత సూర్య , ఆగస్టు 5:**
చెన్నూరు మండలంలోని లింగంపల్లి గ్రామంలో నూతన విద్యుత్ పోల్స్ లైన్ను సోమవారం ప్రారంభించారు.ఎన్నికల ప్రచార సమయంలో గ్రామస్తులు విద్యుత్ సౌకర్యం లేకపోవడం విషయాన్ని కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకువెళ్లారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ శాఖ అధికారులు కొత్త పోల్స్ ఏర్పాటు చేసి లైన్ను అమర్చారు.తమ సమస్యను పరిష్కరించినందుకు గ్రామస్తులు మంత్రి వివేక్ వెంకటస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఇప్పటికే రూ. 10 లక్షల నిధులతో సీసీ రోడ్డు, బోర్వెల్ ఏర్పాటు చేయించినట్లు స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

# సింగరేణిలో మరో ప్రమాదం: కార్మికుడికి పాముకాటు

**అధికారుల నిర్లక్ష్యంపై కార్మికుల ఆగ్రహం**

**మందమర్రి, మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య ఆగస్ట్ 5:**
సింగరేణి మందమర్రి ఏరియాలో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారినట్లు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సోమవారం రోజున కేకే -5లో విధులు నిర్వహిస్తుండగా ఓ సివిల్ కాంట్రాక్ట్ కార్మికుడు పాముకాటుకు గురయ్యాడు. ఘటనకు సంబంధించి అధికారులు స్పష్టత ఇవ్వకుండా బాధితుడిని జోగిపేటలోని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు సహోద్యోగులు తెలిపారు.ఈ ఘటనపై స్పందించిన కార్మికులు మాట్లాడుతూ, “ఇటీవలే కేకే -5లో ఓ కార్మికుడు మృతిచెందిన ఘటన మరిచేముందే, ఇప్పుడు పాముకాటు... మేం తలచుకునేలోపే ఇంకో ప్రమాదం జరుగుతోంది” అని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రమాదాల పట్ల అధికారుల నిర్లక్ష్య ధోరణిని వారు తీవ్రంగా విమర్శించారు.
“ప్రతి ప్రమాదం జరిగినప్పుడు నిజాలను దాచిపెట్టి తప్పుడు నివేదికలు రూపొందించడం అధికారులకు



అలవాటైపోయింది. అసలు ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి? అందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారో స్పష్టత లేదు. ఒక మామూల్ హాస్పిటల్కి తీసుకెళ్లి కళ్లలేపుతున్నారు. ఇది సహించలేనిదీ” అని కార్మికులు మండిపడ్డారు.వారి ఆరోపణల ప్రకారం, ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు పాటించకపోవడమే ఈ పరిస్థితికి కారణమని స్పష్టం చేశారు. పనుల ప్రదేశాల్లో పాములు తిరుగుతున్నప్పటికీ సంబంధిత డిపార్ట్మెంట్ ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవడం లేదని, భద్రతా ప్రమాణాలు మచ్చుతునకగా పాటించబడుతున్నాయని విమర్శించారు.ఇటువంటి ఘటనలపై ఖచ్చితంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, బాధితుడికి తగిన చికిత్స, న్యాయమైన పరిహారం కల్పించాలని కోరుతున్నారు.
సింగరేణిలో భద్రతా లోపాలు ఏమాత్రం చిన్నగా తీసుకోరానివి. గత ఘటనల నుంచి పాఠాలు నేర్చుకోని యాజమాన్యం, కార్మికుల ప్రాణాలకు విలువ ఇవ్వని వ్యవస్థపై సమగ్ర దృష్టి అవసరం.

నేటి ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784
www.prabhatasurya.com


## కళాకారులు గుర్తింపు కార్డుకు దరఖాస్తు చేసుకోవాలి



**మంచిర్యాల జిల్లా. నేటిప్రభాత సూర్య ఆగష్టు 5:**
లక్షెట్టిపేట విశ్రాంతిభవన ఆవరణలో మంగళవారం జరిగిన తెలంగాణ బ్యాండ్ కళాకారుల సమావేశంలో బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం స్టేట్ కార్యవర్గ సభ్యులు యండీ ఫేర్ మహ్మద్, తాజుద్దీన్ బాబా మాట్లాడారు. తెలంగాణ బ్యాండ్ కళాకారులందరికీ గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉండాలని, అందుకోసం ప్రతి కళాకారుడు తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. గుర్తింపు కార్డు కలిగి ఉంటే ప్రభుత్వం అందించే పథకాలు, సదుపాయాలు, ఆర్థిక సహాయం వంటి ప్రయోజనాలను సులభంగా పొందగలరని వారు వివరించారు. తెలంగాణ బ్యాండ్ కళాకారుల ఐక్యతతోనే కళాకారుల సమస్యలు పరిష్కారం అవుతాయని, అందరూ సంఘంలో చురుకుగా పాల్గొని, తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

## మంచిర్యాల జిల్లా పర్యటనలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు





**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాతా సూర్య ఆగష్టు. 5:**
బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు మంచిర్యాల జిల్లా పర్యటనలో భాగంగా దండేపల్లి మండలం గూడెం గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం బీజేపీ శ్రేణులు నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్న రాంచందర్ రావు, లక్షెట్టిపేట్ పట్టణం కరీంనగర్ చౌరస్తా వద్ద ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.తరువాత లక్షెట్టిపేట్ పట్టణంలోని %ట్రా=% గార్డెన్స్‌లో రైతులతో నిర్వహించిన "రైతు సమ్మేళనం"లో పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజి రెడ్డి, మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, గోమాసే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి పాలు అమృతంలాంటివి



**రంగారెడ్డి– నేటి ప్రభాత సూర్య :**
తల్లి పాలు అమృతంలాంటివని, పిల్లలకు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావుఅన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సమావేశం మందిరంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. అలా పడితేనే బిడ్డ సంపూర్ణ అరోగ్యంతో పాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. శిశువుకు 6 నెలలు నిండిన తర్వాత అదనపు ఆహారం అందిస్తూ రెండు సంవత్సరాల వరకు తల్లి పాలు పట్టించాలన్నారు. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లులు పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. తల్లిపాల వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, మాస్ మీడియా అధికారి కే శ్రీనివాసులు, డి పి హెచ్ ఎన్ ఓ మన్మథమ్మ, వైద్యాధికారులు సూపర్వైజర్లు ఆరోగ్య ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కళ్యాణం

**నేటి ప్రభాత సూర్య:**
జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానంలో మొట్టమొదటి సారిగా నూతనంగా ప్రారంభించు శ్రీ మాత గోవింద మాంబ సమేత శ్రీ వీరబ్ర హ్మేంద్ర స్వాముల వారి మాస కళ్యాణంలో గ్రామ ప్రజలు, స్వామివారి భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆలయ పిట్ పర్సన్ శంకర్ బాలాజి తెలిపారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మంగారి దేవస్థానంలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మాస కళ్యాణ మహోత్సవంలు మొదటిగా ప్రారంభించామని, ఇప్పటివరకు స్వామివారికిప్రత్యేకంగా కళ్యాణంఅంటూ ఏమీ లేదని, భక్తుల కోరిక మేరకు ఈ మాస కళ్యాణ మహో త్సవంలు ప్రారంభించామని ఆయన తెలిపారు. మా తా గోవిం దమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి కళ్యాణ మహోత్సవంలు అంగరంగ వైభవంగా జరుగునని ఆయన తెలిపారు. కావున స్థానికులు, భక్తులు విరివిగా పాల్గొని కళ్యాణ మహోత్సవంలు తిలకించాలని ఆయన కోరారు.

# ఇన్స్పిరేషన్ జిల్లాగా భద్రాద్రి నిలవాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్**






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (నేటి ప్రభాత సూర్య):**
జిల్లా ఆస్పిరేషన్ జిల్లాగా కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచే ఇన్స్పిరేషన్ జిల్లాగా రూపాంతరం చెందాలనే లక్ష్యంతో ప్రతి శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రణాళిక అధికారి(సిపిఓ)సంజీవరావు అధ్యక్షత వహించగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఓ సంజీవరావు మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు విశేష కృషి చేస్తున్న కలెక్టర్ ను అధికారులు సన్మానించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపు పొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ సంయుక్తంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలో అనేక రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని ప్రతి ఉద్యోగి సమర్థంగా పనిచేయడంతోనే జిల్లా ఈ స్థాయికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అన్ని విభాగాల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నామని దీని ద్వారా జిల్లా దేశవ్యాప్తంగా ఆదర్శ జిల్లాగా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలు తవ్వాలి అనే పిలుపుతో జిల్లాలో చేపట్టిన సామూహిక కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రారంభమై జిల్లావ్యాప్తంగా విస్తరించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా పిల్లలలో పోషకాహార లోపం ఎనీమియా వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మునగాకు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా ఎనీమియా రాకుండా నియంత్రించవచ్చని వివరించారు. వైద్య మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లాలో అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించి ఆహారపు అలవాట్లను మెరుగు పరి చేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి స్మార్ట్ అంగన్వాడీలు డిజిటల్ తరగతులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వంటివి ఉపయోగపడుతున్నాయని సిడిపిఓ సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. రేగళ్ల అంగన్వాడీ కేంద్రంలో గతంలో చీకటి ఉక్క పోత వల్ల పిల్లలు రావడం తగ్గిపోయిందని ఇప్పుడు విద్యుత్ ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల పిల్లల హాజరు పెరిగిందని వివరించారు.

జిల్లా వ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం ప్రతి పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ఉన్నటువంటి సమస్యలు వాటి పరిష్కారాలను నివేదికల సమర్పించడం ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని అన్నారు. దీని ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చు అని కలెక్టర్ తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో సమన్వయంగా ముందుకు సాగాలని ప్రతి కార్యక్రమాన్ని లక్ష్య ప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు దేశవ్యాప్తంగా ఆదర్శ అభివృద్ధి జిల్లాగా వినిపించేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలో ఆకాంక్షిత అభివృద్ధి లక్ష్యాల్లో విశేష కృషి చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబు రావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరచారి (రిటైర్డ్), ఉద్యోగులకు, సిబ్బందికి 133 మందికి మెడల్స్, ప్రశంసా పత్రాలు, మెమెంటోలు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. వారి సేవలను గుర్తించి మెచ్చుకోవడం ద్వారా మరింత ఉత్సాహంతో సేవలందించేందుకు ప్రతి ఉద్యోగి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్య వైద్య మహిళా శిశు సంక్షేమ ప్రణాళిక శాఖ తదితరులు శాఖల ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలి



**తుర్కయంజాల్–నేటి ప్రభాత సూర్య:**
మున్సిపల్ కార్మికుల రాష్ట్ర 5వ మహాసభలు వచ్చే నెల 19,20 తేదీలలో తుర్కయంజాల్ లో జరిగే మహాసభ ను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం తుర్కయంజాల్ లోని అరుణ కన్వెన్షన్ హాల్లో మహాసభ ఏర్పాట్ల పై యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. కిషన్, టి. నర్సింహాల అధ్యక్షతన జరిగిన సమావేశానికి పాలడుగు భాస్కర్, సిఐటియు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు శ్రమను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదని, సం॥ల తరబడి విధులు నిర్వహించిన పనికి భద్రత కల్పించాలన్నారు రాష్ట్ర ప్రభుత్వం తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా మున్సిపల్ కార్మికుల పర్మినెంట్, కనీస వేతనాల అమలుతో పాటు 2వ పిఆర్‌సిలో మినిమం బేసిక్ రూ. 26,000 వేలు నిర్ణయించి మున్సిపల్ కార్మికులకు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 సం॥లు పైబడిన వారు,మరణించిన కార్మికుల స్థానంలో ఎలాంటి షరతులు లేకుండా వారి కుటుంబ సభ్యులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక మున్సిపాల్టీలలో అభివృద్ధి పేరుతో అవార్డులు %–% రివార్డులను అందుకుంటూ కేంద్ర ప్రభుత్వం నుండి ఫండ్ తెస్తున్నారు. తెచ్చిన ఫండ్‌లో కార్మికులకు మాత్రం వాటా ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని అన్నారు. మున్సిపల్ కార్మికులకు రిట్మెర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ. 50 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, మున్సిపల్ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. పారిశుధ్య పనులకు మున్సిపల్ కార్మికులు ఉదయం 5%–%00 గంటలకే పనికి రావాలని ఒత్తిడి చేస్తున్నారని, ఇకనుండి ఈ పద్ధతి మానుకోవాలని, అధికారులు నిర్ణయించిన సమయానికి రావాలంటే కార్మికుల నివాస ప్రాంతాల నుండి రవాణా సౌకర్యాలను కల్పించాలన్నారు. 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని, అన్ని మున్సిపాల్టీల్లో ఒక్కపూట పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి మున్సిపల్ కార్మికుల సమ్మె సెగ తప్పదని హెచ్చరించారు.

ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్, సిఐటియు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి. కవిత, మధ్యాహ్న భోజనం రాష్ట్ర అధ్యక్షులు స్వప్న, మెడికల్ ఈ –హెల్త్ రాష్ట్ర కార్యదర్శి బలరామ్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. యాదగిరి, సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్. ఎల్లేష్, జె. పెంటయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి ఎంఎల్ఎ వీర్లపల్లి శంకర్ ప్రయాణం

**జంతర్ మంతర్ వద్ద బీసీలకు 42% రిజర్వేషన్ల కోసం మహాధర్నా**

**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (ఆగస్టు 5) :**
బీసీ హక్కుల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీకి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రాత్రి బయలుదేరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో జంతర్ మంతర్ వద్ద జరుగనున్న మహాధర్నాలో పాల్గొనడానికి ఆయన ఢిల్లీ వెళ్లారు. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే శంకర్, "కేంద్ర ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లకు ప్రధాన అడ్డంకిగా మారింది. 9వ షెడ్యూల్‌లో బీసీ బిల్లును చేర్చే దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలి," అని డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలో బీసీల తరఫున పోరాటానికి సిద్ధమవుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. "దేశంలోని ఓబీసీలకు రాహుల్ గాంధీ అండగా ఉన్నారు. ఇది ఒక్క తెలంగాణ కోసం కాదు... దేశమంతటినీ ప్రభావితం చేసే ఉద్యమం" అని శంకర్ పేర్కొన్నారు. ఈ మహాధర్నాలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు భారీగా పాల్గొననున్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వెంట షాద్‌నగర్ కాంగ్రెస్ నాయకులు కూడా ఢిల్లీకి చేరుకున్నారు.



# కమిషనర్ రూట్ సపరేట్.....

- ఫోన్ లిఫ్ట్ చేయడు... సమాధానం చెప్పడు.....
- అక్రమ నిర్మాణాలకు ప్రేక్షకపాత్ర పోషిస్తున్న కమిషనర్.... స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అడ్డుకట్ట వేసేనా.....
- అనుమతులు లేకుండా బహుళఅంతస్తుల నిర్మాణాలు,రిసార్ట్ లు
- జోరుగా సాగుతున్నాయి.అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులే ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- ముందుగా నోటీసులు జారీ చేసి తర్వాత అక్రమార్కులతో బేరసారాలు సాగిస్తూ జేబులు
- నింపుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

**ఆదిబట్ల–నేటి ప్రభాత సూర్య:**
ఆదిబట్ల మున్సిపల్ లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుండా అక్రమ రిసార్ట్ నిర్మాణాలకు తెర తీస్తున్నారు. హెచ్ఎండీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. హాప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తూ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు మధ్య వర్తిత్వం వహిస్తుండడం విశేషం. ఈ క్రమంలో నిర్మాణదారుల నుంచి ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన రుసుము భారీ మొత్తంలో గండి కొడుతున్నారు. నిలువరించాల్సిన అధికార యంత్రాంగం మామూళ్ల మత్తులో జోగుతోంది. వివరాల్లోకి వెళితే ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి రాందాస్ పల్లి కి వెళ్లే దారిలో ఓ రిసార్ట్ ను ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించడం విమర్శలకు తావిస్తోంది.

**అనుమతులు లేకుండా రిసార్ట్..**
ఆదిబట్ల మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ గా మారింది. ఎలాంటి అనుమతి లేకుండా పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణం చేపడుతున్న అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇక్కడ అక్రమంగా మినీ రిసార్ట్ కం ఫార్మ్ హౌస్ పేరిట నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నిర్మాణానికి హెచ్ఎండీఏ నుంచి కూడా ఎలాంటి అనుమతులు తీసుకోలేదని అధికార యంత్రాంగం చెబుతోంది. అక్రమ నిర్మాణాన్ని అడ్డుకుందామంటే అధికార పార్టీ నాయకులు ఒత్తిళ్లు చేస్తున్నారని కమిషనర్ చెప్పుకోవడం విశేషం.....

ఈ అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ బాల కృష్ణను నేటి ప్రభాత సూర్య ప్రతినిధి ఫోన్ లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా, ఆయన స్పందించడం లేదు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలపై జిల్లా ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో ..వేచి చూద్దాం..

## రైతుసేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం

**23 మందిని నూతన సభ్యులుగా చేర్చుకోవడానికి ఆమోదం.**

**రైతుల అభివృద్ధే ధ్యేయంగా సహకార సంఘం:టె స్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య**



**తుర్కయాంజాల్:నేటి ప్రభాత సూర్య :**
రైతుల అభివృద్ధే ధ్యేయంగా తుర్కయంజాల్ సహకార సంఘం పని చేస్తాయని టె స్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. తుర్కయంజాల్ రైతుసేవా సహకార సంఘం పాలకవర్గ సమావేశం సంఘం అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. సంఘంలో 23 మందిని నూతన సభ్యులుగా చేర్చుకోవడానికి ఆమోదించినట్లు తెలిపారు. వీటితో పాటు 2024 25 ఆర్థిక సంవత్సర ఆడిట్, 2025 26 సంవత్సరం లోని మూడు నెలల జమా ఖర్చులను ఆ మోదించారు. అదేవిధంగా 24 మంది రైతులకు రూ. 2 కోట్ల 50 లక్షలు రుణాలు మంజూరు చేయడానికి తీర్మానం చేశామన్నారు. కార్యక్రమంలోకార్య క్రమంలో రైతు బంధు జిల్లా మాజీ అధ్యక్షులు, సహకార సంఘం బ్యాంక్ డైరెక్టర్ వంగేటి లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవ రెడ్డి, కొండ్రు స్వప్న శ్రీని వాస్, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణరెడ్డి, సంఘ సెక్రటరీ వై.రాందాస్ పాల్గొన్నారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## క్రీడారంగం



# మిస్టర్ యాంగ్రీ


ఇంగ్లాండ్‌తో ఓవల్ వేదికగా జరిగిన ఐదో టెస్టులో టీమ్‌ఇండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శనతో హీరో అయ్యాడు. ఆశల్లేని స్థితిలో నుంచి టీమ్‌ఇండియాను రేసులో నిలిపాడు. ఆఖరి రోజు ఇంగ్లాండ్ విజయం లాంఛనమే అనుకున్న దశలో ప్రత్యర్థి నుంచి గెలుపును లాగేసుకున్నాడు. నిప్పులు చెరిగే బంతులతో ఇంగ్లాండ్ లోయార్డర్‌ను చిత్తు చేసి భారత్‌కు చరిత్రాత్మకమైన విజయాన్ని కట్టబెట్టాడు.సిరాజ్ ఈ మ్యాచ్‌లో మొత్తం 9 వికెట్లు (4 తొలి ఇన్నింగ్స్, 5 రెండో ఇన్నింగ్స్) దక్కించుకొని ఇంగ్లాండ్ పతనాన్ని శాసించాడు. అతడి అద్భుత ప్రదర్శనకుగానూ సిరాజ్‌పై మాజీలు ప్రశంసలు కురిస్తున్నారు. వారెవ్వా సిరాజ్ అంటూ మెచ్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ నాజీర్ హుస్సేన్ ఓ ఆసక్తికరమైన విషయం షేర్ చేసుకున్నాడు. బెన్ స్టోక్స్ సారథ్యంలోని ఇంగ్లాండ్ జట్టు, సిరాజ్‌కు ఓ నిక్‌నేమ్ పెట్టినట్లు చెప్పాడు. అతడని వాళ్లు అదే పేరుతో పిలుస్తారని ముద్దుపేరు రివీల్ చేశాడు. సిరాజ్ మైదానంలో ఎప్పుడూ అగ్రెసివ్‌గా ఉంటాడు. అతడు ఫుల్ ఫైర్‌తో బౌలింగ్ చేస్తుంటాడు. అందుకే ఇంగ్లాండ్ జట్టు సిరాజ్‌కు 'మిస్టర్ యాంగ్రీ' అనే నిక్‌నేమ్ పెట్టిందని నాజీర్ హుస్సేన్ చెప్పాడు. అలాగే ఓవల్‌లో అతడి బౌలింగ్‌ను మెచ్చుకున్న నాజీర్, సిరాజ్ ఈ స్థాయికి చేరుకోవడానికి ప్యాషన్ అండ్ స్కిల్ ఇలా ప్రతీది కలిగి ఉండి 'వినోదం పంచేందుకే పుట్టాడు'గా అభివర్ణించాడు.



# మెస్సీ భారత్ పర్యటనకు షెడ్యూల్ ఫిక్స్

ఫుట్‌బాల్ ప్లేయర్ లియోనెల్ మెస్సీ డిసెంబర్ 12న భారతదేశానికి రానున్నాడు. కోల్‌కతా, అహ్మదాబాద్, ముంబై, న్యూఢిల్లీలలో మెస్సీ సందర్శన జరగనుంది. 2011లో కోల్‌కతాలోని సాల్ట్‌లేక్ స్టేడియంలో వెనిజులాతో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడిన మెస్సీకి.. 14 ఏళ్ల తర్వాత ఇది రెండోసారి భారత్ లో పర్యటించడం. ప్రస్తుతం 38 ఏళ్ల మెస్సీ అమెరికాలోని మేజర్ లీగ్ సాకర్‌లో ఇంటర్ మయామీ జట్టు తరపున ఆడుతున్నాడు. కోల్‌కతాలో రెండు రోజులు ఉండనున్న మెస్సీ.. అక్కడ డిసెంబర్ 13న 70 అడుగుల ఎత్తైన తన విగ్రహాన్ని ఆవిష్కరిస్తాడు. అయితే.. ఇది ప్రపంచంలోనే మెస్సీ యొక్క అతి పెద్ద విగ్రహంగా నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఆ తర్వాత ఈడెన్ గార్డెన్స్‌లో కన్సర్ట్‌తో పాటు సౌరవ్ గంగూలీ, జాన్ అబ్రహం, లియాండర్ పేస్, బైచుంగ్ భూటియా వంటి ప్రముఖులతో కలిసి.. ఏడు మంది ఆటగాళ్లతో కూడిన సాఫ్ట్‌బాల్ మ్యాచ్‌లో మెస్సీ పాల్గొననున్నాడు. ఇక ఆ తర్వాత అర్జెంటీనా ఆటగాళ్లతో ఒక మాస్టర్ క్లాస్ కూడా జరుగుతుంది. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ కన్సర్ట్ లో పాల్గొని మెస్సీని సన్మానించనున్నారు. కోల్‌కతా తర్వాత అహ్మదాబాద్‌లో అదానీ ఫౌండేషన్ కార్యక్రమంలో పాల్గొననున్న మెస్సీ.. దాని తర్వాత అక్కడి నుండి ముంబైకి వెళ్తాడు. అయితే అక్కడ మెస్సీ క్రికెట్ మ్యాచ్ ఆడడం లేదని నిర్వాహకులు స్పష్టం చేశారు. డిసెంబర్ 14న ముంబైలోని వాంఖడే స్టేడియంలో కన్సర్ట్, కప్ జరుగుతాయి. అక్కడే భారత ఫుట్‌బాల్ జట్టుతో సంభాషించి, మరో సాఫ్ట్‌బాల్ మ్యాచ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. చివరగా డిసెంబర్ 15న న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమై.. ఆ తర్వాత అరుణ్ జైట్లీ స్టేడియంలో కన్సర్ట్ లో పాల్గొంటాడు. ప్రతి నగరంలో మెస్సీ పిల్లలతో మాస్టర్ క్లాస్ నిర్వహిస్తాడు.





# మళ్లీ బ్యాట్ పట్టిన సూర్యకుమార్

భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కొన్ని రోజుల కిందట స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ చేయించుకున్నాడు.త్వరలోనే ఆసియా కప్ 2025 జరగనున్న తరుణంలో టీమిండియా అభిమానులకు గుడ్ న్యూస్ వచ్చింది. సర్జరీ తర్వాత భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మొదటి సారి ప్రాక్టీస్ కోసం వచ్చాడు. గత వారం సూర్య కుమార్ యాదవ్ బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడని తెలిసింది. దాంతో ఆసియా కప్ టోర్నీకి సూర్య అందుబాటులో ఉంటాడని తేలడంతో అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూలై నెలలో జర్మనీలో సూర్యకుమార్‌కు స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ జరిగిందని తెలిసిందే. సూర్య కుమార్ యాదవ్ కడుపు దిగువ కుడి భాగంలో స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ నుంచి కోలుకుంటున్నాడు. సర్జరీ తరువాత కొన్ని రోజుల నుంచి భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ వైద్య సిబ్బంది పర్యవేక్షణలో సూర్య ఉన్నాడు. సెప్టెంబర్ 9 నుండి ప్రారంభమయ్యే ఆసియా కప్ కి ముందు అతను జట్టుతో చేరనున్నాడని కన్ఫామ్ అయింది. ఈసారి ఆసియా కప్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో నిర్వహించాలని ఏసీసీ ఇటీవల ప్రకటించింది. మొదట ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరిగే టీ20 సిరీస్‌తో సూర్యకుమార్ యాదవ్ కమ్ బ్యాక్ చేయాల్సి ఉంది. అయితే ఈ సిరీస్ వచ్చే ఏడాది వరకు వాయిదా పడింది. దాంతో టీ20 కెప్టెన్ సూర్య నేరుగా ఆసియా కప్‌లో ఆడనున్నాడు. సూర్యను దిలీప్ ట్రోఫీలో వెస్ట్ జోన్ జట్టులో కూడా చేర్చారు. కానీ స్పోర్ట్స్ హెర్నియా సర్జరీ కారణంగా సూర్యకుమార్ యాదవ్ ఈ టోర్నమెంట్‌ను వదులుకోవలసి వచ్చింది. ఆసియా కప్‌లో పాకిస్తాన్ తో ఆడవద్దని టీమిండియాపై ఒత్తిడి పెరుగుతోంది.



# విశ్వంభరలో ఆషిక రంగనాథ్ పోస్టర్ విడుదల


మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టిన రోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్ళలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## సినిమా

# మృణాల్ ప్రేమలో ధనుష్

కోలీవుడ్ స్టార్ ధనుష్ ప్రస్తుతం సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంలోనూ మీడియా దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇటీవలే ఆయన 'కుబేర' మూవీతో విజయం అందుకున్నాడు. ప్రస్తుతం స్వీయ దర్శకత్వంలో రూపొందుతోన్న ఇడ్లీ కడై మూవీ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నాడు. హీరోగా మాత్రమే కాకుండా, దర్శకుడు, నిర్మాత, సింగర్ గాను పేరు తెచ్చుకున్న ధనుష్ గురించి ఎప్పుడూ ఏదో ఒక రూమర్ నెట్టింట హల్‌చల్ చేస్తూనే ఉంటుంది. కొద్ది రోజుల క్రితం ధనుష్ సూపర్‌స్టార్ రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్యతో 18 ఏళ్ల పెళ్లి జీవితానికి ముగింపు పలికిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ధను ష్ పేరుతో పలు కథనాలు వెలువడు తున్నాయి. ఒకప్పుడు మీనాతో పెళ్లి వార్తలూ అని చక్కర్లు కొట్టాయి. అయి తే మీనా వాటిని ఖండిస్తూ, అలాంటి సంబంధమే లేదు, మా పాపను బాధించకండి అంటూ స్పందించారు. ఇప్పుడు బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్‌తో ధనుష్ ప్రేమలో ఉన్నట్టు కథనాలు వెలువడుతున్నాయి. మృణాల్ పుట్టినరోజు వేడుకలో ధనుష్ ఆమెతో సన్నిహితంగా కనిపించడంపై, వీరిద్దరి మధ్య స్పెషల్ బాండ్ ఉందని టాక్ స్పీడ్‌గా స్ప్రెడ్ అయింది. చేతులు పట్టుకుని మాట్లాడుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో లవ్ గాసిప్‌కు బలం చేకూరింది.





Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.